# కథామంజరి

## పది కథల సమాహారం



**బాలకథల ప్రత్యేక సంచిక**

**నవంబర్ 2025**

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

**నవంబర్ 2025**

సంపుటి : 6 ♦ సంచిక : 11



# బాలల
# దినోత్సవ
# శుభాకాంక్షలు



# కథామంజరి

## 'శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ' స్మారక సంక్రాంతి కథల పోటీ

సంక్రాంతి సందడికి, సంబరాలకి సమాయత్తం చేస్తూ కథామంజరి సంక్రాంతి కథల పోటీ నిర్వహిస్తోంది. ఈ కథల పోటీకి నాటి, నేటి మేటి కథకులతో బాటు, కొత్తకలాలు కూడా కలవాలని ఆకాంక్షిస్తున్నాం. మంచి కథలకు సౌహార్ద పూర్వక స్వాగతం!

| | | |
|---|---|---|
| **ప్రథమ బహుమతి** | .. | **₹5000/-** |
| **ద్వితీయ బహుమతి** | .. | **₹ 3000/-** |
| **తృతీయ బహుమతి** | .. | **₹ 2000/-** |
| **10 ప్రత్యేక బహుమతులు** | .. | **₹ 1000 /-** చొప్పున |

### నిబంధనలు – అన్నీ మామూలువే .. అంటే -

- కథ 1200 పదాల కంటే మించరాదు.
- కథను వర్డ్ ఫార్మాట్‌లో యూనికోడ్‌లో టైపు చేసి పంపాలి. పిడియఫ్‌లో పంపే కథలు అనుమతించబడవు.
- కథతో పాటు హామీపత్రం జతచెయ్యాలి. కథ స్వీయరచన అని, మరే ఇతర పత్రికలలోను, సాంఘిక మాధ్యమాలలోను, బ్లాగులలోను ప్రచురణ గాని ప్రసరణ గాని జరగలేదని సుస్పష్టంగా హామీపత్రంలో పొందుపరచాలి.
- పోటీకి వచ్చిన కథలలో కొన్నిటిని సాధారణ ప్రచురణకు ఎంపిక చేసుకుని, వీలువెంబడి ప్రచురించడం జరుగుతుంది.
- కథ హామీపత్రంలో "**కథామంజరి సంక్రాంతి కథల పోటీకి**" అని వ్రాసి పంపాలి.
- కథలు మెయిల్ ద్వారా ***submit@kathamanjari.in*** కి **30 నవంబరు 2025** లోగా చేరాలి.

కథకులందరూ ఈ కథల పోటీలో ఉత్సాహంగా పాల్గొని, పోటీని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాం.

**కథామంజరి బృందం**



# మా జట్టు

**సంపాదకుడు**
జయంతి ప్రకాశ శర్మ

**ప్రచురణ కర్త**
అవసరాల వెంకటరావు

**సంపాదక సహకారం**
ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నందూరి సుందరీ నాగమణి

**ప్రచురణా సహకారం**
ఎం.ఎల్. కాంతారావు

**సాంకేతిక సహకారం**
Harbinger Publishing

**బొమ్మలు**
కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**




## శీర్షికలు


కథాకీయం ... ... ... ... ... ... i

విశిష్ట అతిథి ... ... ... ... ... ... ii

కథా మార్గదర్శి ... ... ... ... ... ... iv

కథా పరిచయం ... ... ... ... ... ... vi

కథాపుస్తక పరిచయం ... ... ... ... ... ... viii

వినదగునెవ్వరు చెప్పిన .. ... ... ... ... ... ... x


## కథలు, వ్యాసాలు


సాయం ... కోనే నాగ వెంకట ఆంజనేయులు ... 1

నిజాయితీపరులు! ... యు. విజయశేఖర రెడ్డి ... ... 4

ఏకగ్రీవం ... సుస్మితా రమణమూర్తి ... ... 6

తేనెటీగలు లేకపోతే! ... వడ్డేపల్లి వెంకటేశ్ ... ... ... 11

కోతి లౌక్యం ... మహంకాళి స్వాతి ... ... ... 13

అతిథి దేవోభవ ... నీలం రాము ... ... ... 15

మృగరాజు అభినందన ... పైడిమర్రి రామకృష్ణ ... ... ... 18

సాహస బాలురు ... యశస్వి గంజాం ... ... ... 20

దాతకు సన్మానం ... నారంశెట్టి ఉమామహేశ్వరరావు ... 25

బంగారు పిచ్చుక ... కీ. శే. బి. వి. నరసింహారావు ... ... 28


Cover Page Credits : Shri Surampudi

# కథాకీయం

బాలకథల పుట్టుపూర్వోత్తరాల మీద పరిశోధనలు జరిగి.. చాలా విషయాలు, విశ్లేషణలు వచ్చాయి గాని.. ఆ విషయాల జోలికి వెళ్ళకుండా, ఓ సాధారణ మనిషిగా ఆలోచిస్తే.. ఎవరికైనా సరే రెండు మూడు విషయాలు గోచరిస్తాయి! ప్రపంచంలో ఏ భాషలో చూసినా సరే.. బాలకథల్లో ఓ మంచి సందేశమే కనబడుతుంది గాని చెడు కనబడదు. తొంభై తొమ్మిది శాతం బాలకథల్లో సహజత్వం కనబడదు గాని, విమర్శకు తావు ఇవ్వలేదు. 'జంతువులు మాట్లాడుకోవడమేమిటీ.. అంతా ట్రాష్' అనే తర్కం వినబడదు. ఏ బాలకథ మీదా ఖండనలూ, విమర్శలూ ఎక్కడా కనబడిన దాఖలాలు కూడా లేవు! ఏ యుగంలో చూసినా లేదా ప్రాచీన, ఆధునిక సాహిత్యంలో చూసినా సరే.. బాలకథలకు ఓ ఉన్నతమైన స్థానం ఉంది. ఇవి మనిషిని తీర్చిదిద్దుతాయనే ఓ ప్రగాఢమైన నమ్మకం ఉంది. బాల్యంలో ఈ కథలు చాలా ప్రభావం చూపెడతాయనే శాస్త్ర పరిశోధనలు కూడా ఉన్నాయి!

ఈ క్రమంలో ఆలోచించి, ఈ సంచికను బాలకథల ప్రత్యేక సంచికగా విడుదల చేయడానికి నిర్ణయం తీసుకున్నాం! మన దేశంలో ప్రతీ ఏటా నవంబరు 14 తేదిని "బాలల దినోత్సవం" జరుపుకుంటున్న శుభతరుణంలో.. ఎందరో మహానుభావులు పిల్లల మనోవికాసం కోసం అందిస్తున్న సేవలకు తోడుగా... మా వంతుగా బాలకథలను ప్రత్యేకంగా అందిస్తున్నాం!

రోజులు మారి, మనుషుల ఆలోచనలతో పాటు జీవనవిధానం, గమ్యాలు మారిపోయాయి! అయినా సరే బాల్యం అపురూపమైనది, అందమైనది. మంచి నడవడి రావాలన్నా, నైతిక విలువలను తెలియచేయాలన్నా, ఊహాశక్తి పెంపొందించాలన్నా, విజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలన్నా... బాల్యంలో మంచి కథలు చదివించాలి! వాటి ఫలితాలు.. దశాబ్దాలుగా మన కళ్ళ ఎదుట ఎన్నో నిదర్శనాలు కనబడతాయి! మనిషి జీవనానికి శాస్త్రవిజ్ఞానం ఎంత అవసరమో.. మంచి లక్షణాలు కలిగి ఉండటం కూడా అంతే అవసరం ఉంది! విద్యార్హతలు ఎన్ని ఉన్నా, ఉన్నత స్థితిలో ఉన్నా, హోదా ఉన్నా.. అతనికి ఉండవలసిన మంచిగుణాలు, నడవడిక లేకపోతే రాణించదు. మంచైనా, చెడయినా.. వాటికి పునాది పడేది ఎక్కువగా బాల్యంలోనే! ఆ పునాదిని మంచి వైపు మలిచి బలాన్ని చేకూర్చేవి కథలే! నేటి బాలలు రేపటి 'మంచి' పౌరులు కావాలంటే బాలకథలు చదివించే బాధ్యత తీసుకోవలసింది నేటి పౌరులే!

పిల్లలకి, పెద్దలకి బాలల దినోత్సవ శుభాకాంక్షలు!

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి

**శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు**

ప్రతీ మనిషి.. పసితనంలో పాటలకి స్పందిస్తారు. బాల్యంలో.. తెలిసీ తెలియని వయసులో, అర్థం అయినా కాకపోయినా సరే కథలు విని ఆహ్లాదపడతారు! తర్వాత కాస్త చదువుకునే వయసు వచ్చిన తర్వాత చదువు మీద ఆసక్తి కలిగి, సృజనాత్మకత కలిగించేవి ఆ కథలే! అలా ఆయా వయసులలో వినగా, చదవగా.. ఆ చిన్ని మస్తిష్కంలో గూడు కట్టుకుని, జీవితాంతం గుర్తుండిపోయేవి ఆ బాలకథలే! ఆ నేపధ్యంలో ఎదిగిన పిల్లల నడవడిక, ఆలోచనలు, సృజనాత్మకత.. వంటి అన్ని విషయాలలో ఆ కథల ప్రభావం ఉంటుంది. ఆ కథలు.. పేరుకి బాలకథలే కాని, ఆబాలగోపాలం అభిమానించే కథలే! ఆ కథల శైలి, భాష, కథావస్తువు, కథనం.. వంటి అంశాలకి ఓ ప్రత్యేకత ఉంటుంది. ఏ రచయితైనా సరే బాలకథలు కూడా వ్రాయగలరేమో గాని.. కొద్ది మంది రచయితలు మాత్రం బాల కథలే వ్రాయాలనే ఓ గొప్ప ఆలోచనతో ముందుకు నడిచారు. ఈ తరం వారిలో అలాంటి బాలకథా రచయితలలో ప్రముఖంగా చెప్పుకోవలసిన రచయిత, కేంద్ర బాల సాహితీ అవార్డు గ్రహీత శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు గారు.

చిన్నతనంలో తల్లిదండ్రులు చెప్పిన కథలు, ఆ బాల్యంలోనే పిల్లల కథల పుస్తకాలు చదివే అలవాటు.. కథలు, ముఖ్యంగా బాలకథలు వ్రాయడానికి స్ఫూర్తినిచ్చాయని ఉమామహేశ్వరరావు అంటారు. అంతేకాకుండా ఇతిహాసాలు, పురాణాల ప్రభావం ఉండటం.. వాల్మీకి మహర్షి అంటే ఇష్టపడడం...వారిలో రచనలు చేయడానికి దోహదపడ్డాయి. వీటన్నిటితో పాటు మరో స్ఫూర్తి.. వీరు పుట్టింది కూడా బాలల దినోత్సవం నాడే ఆయన పదో తరగతి చదువుతున్నప్పుడే “మేలెరిగిన మనిషి” అనే అనుబంధ నవల వ్రాస్తే.. దానిని బాలజ్యోతి మాసపత్రిక వారు ప్రచురించారు. పిల్లల్ని, పెద్దల్ని కూడా చదవింపచేయగల రచనా శైలి, భాష, కథావస్తువు.. ఉమామహేశ్వరరావుగారి రచనలలో కనబడతాయి. ముఖ్యంగా బాలకథల్లో ఉండవలసిన మంచి సందేశం.. వీరి రచనలలో ప్రస్ఫుటంగా కనబడి, ఆకట్టుకుంటుంది. ఇప్పటి వరకు వారు వ్రాసిన పదిహేను వందల కథల్లో.. ఏ కథలు బావున్నాయని ఎంపిక చేయలేం.. కారణం అన్నీ మంచివే! అన్నీ ఆబాలగోపాలాన్ని అలరిస్తాయి. ఆ రచనాపటిమ వెనుక.. అనంతమైన కృషి, బాలలను తీర్చి దిద్దాలనే ఓ దృఢసంకల్పం ఉన్నాయి. సహజంగా ఇలాంటి ఆలోచనలు, ఆసక్తి ఉన్నవాళ్లు ఉపాధ్యాయ వృత్తిలో ఉంటారనుకుంటాం! కాని ఉమామహేశ్వరరావు గారు తపాలా శాఖలో పర్యవేక్షకుడుగా పనిచేశారు. అటు ఉద్యోగం.. ఇటు సాహితీ సేవలు.. రెండింటిలో అగ్రస్థానంలో నిలిచారు.

1964 బాలల దినోత్సవం నాడే.. పార్వతీపురం దగ్గరలో ఉన్న గెద్దలుప్పి గ్రామంలో పుట్టిన ఉమామహేశ్వరరావుగారు ఎం.ఏ. చదివారు. వ్యాస, కథా రచనలతో పాటు కవి సమ్మేళనాలు నిర్వహించడం, బాలసాహిత్య కార్యశాలలు

నిర్వహించడం, 'నారంశెట్టి బాలసాహిత్య పురస్కారం' క్రింద బాల సాహితీవేత్తలను ఏటేటా సత్కరించడం, బాల సాహిత్య రచనలు చేయడంలో శిక్షణ ఇవ్వడం.. వంటి ఎన్నో సేవలందిస్తున్న ఉమామహేశ్వరరావుగారు గేయాలు, గేయ కథలు, ఆధ్యాత్మిక వ్యాసాలు, వ్యాసాలు, పద్యాలు.. వంటి అన్ని ప్రక్రియలలో రచనలు చేసారు. దాదాపు తెలుగులో వచ్చే అన్ని పత్రికలలోనూ వీరి రచనలు ప్రచురితమయ్యాయి. ఉమామహేశ్వరరావుగారి రచనలతో.. ఇరవై వరకు కథా సంపుటాలు, ఐదు నవలలు, గేయసంపుటాలు, వ్యవసాయ పుస్తకాలు.. వెలువడ్డాయి. వీరి "ఆనందలోకం" అనే నవలకి, 2018 సం.లో కేంద్ర సాహిత్య అకాడమీ వారి "బాల సాహిత్య పురస్కారం" లభించింది. వీరు ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ "విశిష్ట తెలుగు భాషా సేవా పురస్కారం" తో పాటు.. ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. వీరి రచనలు చాలా భాషల్లో అనువదింపబడి, జాతీయ అంతర్జాతీయ పత్రికలో ప్రచురింపబడి మన్ననలు అందుకున్నాయి. ఉమామహేశ్వరరావుగారి రచనలపై పరిశోధనలు చేసి పలువురు డాక్టరేట్, ఎం.ఫిల్. పట్టాలు పొందారు.

బాలసాహిత్యంలో నిత్యం నిమగ్నమై సేవలు అందిస్తున్న నారంశెట్టి ఉమామహేశ్వరరావుగారు.. ఈ బాలకథల ప్రత్యేక సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేయడం ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. వారికి ధన్యవాదాలు తెలియచేసుకుంటూ, వీరి కలం నుండి మరెన్నో బాలకథలు వెలువడాలనీ ఆశిస్తున్నాం!

***కథామంజరి బృందం***



# కథా మార్గదర్శి

**'బాల బంధు' కీ. శే. బి వి నరసింహారావు**

"నా కొలిచే దేవుళ్ళు పసివాళ్ళు .. గుండెగుడిని నిండుగ కొలువుండిన దేవుళ్ళు పసివాళ్ళు" అంటూ తన్మయత్వంతో పాడుకుంటూ, తన జీవితాన్ని బాల సాహిత్యానికి, బాల వినోదానికీ వెచ్చించిన కవి, రచయిత, వక్త, నాట్యకారుడూ .. శ్రీ బాడిగ వెంకట నరసింహారావు గారు.

"తప్పట్లోయ్ తాళాలోయ్ దేవుని గుళ్ళో బాజాలోయ్" అంటూ పిల్లల్లో పిల్లాడులా కలిసిపోయే నరసింహారావుగారు.. 1913వ సంవత్సరం ఆగస్టు 15వ తేదీన కృష్ణా జిల్లాలోని కౌతారం గ్రామంలో జన్మించారు. దిగువ మధ్య తరగతి కుటుంబంలో ఉండే కష్టాలను అనుభవించి, వాటిని అధిగమించే దారులు వెతుక్కునేవారు. కాకినాడ ఆంధ్ర కళాసమితిలో నాటకాలు వేస్తే, వారే చదువు చెప్పిస్తారని ఆ సంస్థలో చేరారు. అలా కళకు చేరువయ్యారు. బి.ఏ. కాకినాడ పి.ఆర్. కళాశాలలోనూ, బి.ఇడి. రాజమండ్రిలోనూ చదివారు. ఉపాధ్యాయుడుగా, స్కూల్ ఇన్స్పెక్టర్ గా ఉద్యోగం సాగించిన శ్రీ నరసింహారావు గారు వృత్తిరీత్యా కూడా పిల్లల మధ్యే గడిపేవారు.

సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు అన్న "బాలల భాషను మనం కొంతవరకు అనుకరించగలం గాని బాలల భావాల్ని మాత్రం అందుకోలేం" మాటని ఆలంబనగా, స్ఫూర్తిగా తీసుకుని బాల సాహిత్యం వైపు దృష్టిసారించారు. అనతికాలంలోనే ఆయన ప్రావీణ్యత సంపాదించి.. రచన, నాట్యం, గానం అన్నింటినీ పిల్లలకు అనువుగా మార్చుకుని పిల్లలలో ఒకరిగా మారిపోయారు.

"పిల్లలకే అల్లరి తెలుసు, పిల్లలదే మల్లెల మనసు" అని గానం చేసినా, "అల్లారుముద్దు పిల్లల్లారా! ఇల్లారండి భయపడకండి .. ఇదిగో నాహృది! మీ విడిది! ఇట దొరుకుతుంది మీకు వలసింది" అని కావ్యగానం చేసినా శ్రీ నరసింహారావుగారికే చెల్లింది. ఆయన వ్రాసిన "పాలబడి పాటలు" 1958వ సంవత్సరంలో జాతీయ బహుమతి పొందింది. ఆయన నృత్యం ఆయనకి "భరత కళానిధి" బిరుదును తెచ్చిపెట్టింది. 1975లో ప్రపంచ తెలుగు సభలలో సత్కరింపబడ్డారు. ఇంకా ఎన్నో, మరెన్నో సత్కారాలు, బిరుదులు పొందిన ఆయనకి, మనసుకు దగ్గిరయిన బిరుదు మాత్రం "బాలబంధు"వే! దీనిని ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ వారు 1978లో ప్రదానం చేశారు.

ఆయన కథలు, కవితలు, పాటలు పదిహేడు సంకలనాలుగా విరిచిన ఆయన సాహితీ యానంలో ఎన్నో మైలు రాళ్లు, ఎంతో మందితో సాహచర్యం, స్పందన. ఆయన నృత్యాభినయం చూసి మురిసిన 'హరికథా పితామహ' శ్రీమదజ్జాడ

ఆదిభట్ల నారాయణదాసుగారు ఆశువుగా కవిత్వంతో ప్రశంసించడం, 'కవిసామ్రాట్' విశ్వనాథవారు ఈ ప్రత్యేక తరహా నాట్యానికి 'భావనాట్యం' అని నామకరణం చేయడం కొన్ని ఘట్టాలు.

పిల్లలకి సులువుగా అర్ధమయి, వారికి వారే చదువుకునే సరళమైన భాషలో పాటైనా, పద్యమైనా, కథయినా రాయగల పద సంపద శ్రీ నరసింహారావు గారి సాహిత్యంలో కనబడుతుంది. కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, నండూరి, కొనకళ్ళ మొదలైన వారితో సాహిత్య సాన్నిహిత్యం చేసిన శ్రీ నరసింహారావుగారు జనవరి 6, 1994 న విజయవాడ లో ఒక సాహితీ ప్రసంగం చేస్తూ, తన 80 వ ఏట స్వర్గస్తులయ్యారు.

అరుదైన బాలసాహిత్యానికి జీవితాంతం సేవచేసిన ఆ 'బాలబంధు' కి మా అక్షరనివాళి.

**కథామంజరి బృందం**

# కథా పరిచయం

## బాల సాహిత్యం – పంచతంత్రం

బాల సాహిత్యం అంటే బాలల సాహిత్యం. అంటే బాలల కోసం సృజించిన సాహిత్యం. అయితే ఆ సాహిత్యాన్ని అత్యంత మక్కువతో అనుభవించేది బాలల కోవకు చెందనివారు మాత్రమే అంటే అబద్ధమే! పిల్లలు మాత్రమే ఆనందించడం లేదు. పెద్దవాళ్లు కూడా ఈ రోజుకీ బాలల సాహిత్యాన్ని చదువుతూ ఆనందిస్తున్న వాళ్ళే. ఆ సాహిత్యాన్ని సృష్టించేవారు కూడా పెద్దవారే! బుడుగు రాసిన ముళ్ళపూడి తన చిన్నతనాన్ని ఎంత అనుభవించి రాసాడోననిపిస్తుంది.

బాల సాహిత్యం ఎన్నో రూపాలలో కనబడుతుంది. కవితలు, కథలే కాదు.. పిల్లల పాటలు, కార్టూన్ కథలు, పిల్లల ఆటలు, జానపద గేయాలు, సామెతలు, పొడుపు కథలు ఇలా ఎన్నో! సుమతీ శతకం, వేమన శతకం బాల సాహిత్యమే కదా! రామాయణం, మహా భారత, భాగవత కథలను పిల్లలకు చెప్పే విధంగా ఎంతమంది ప్రయత్నించలేదు! ఏ కాలానికి ఆ కాలంలో పిల్లలను దృష్టిలో పెట్టుకుని రాస్తూనే ఉన్నారు. పిల్లలే కదా భవిష్యత్తులో ఉత్తమ పౌరులై సమాజాన్ని ముందుకు నడిపించేది! కాశీమజిలీ కథలు, పంచతంత్ర కథలు కొత్త రూపాలు సంతరించుకున్నా, అవి ఎప్పుడూ నిత్య నూతనంగా పిల్లలను, పెద్దవారిని కూడా అలరిస్తూనే ఉన్నాయనడం అతిశయోక్తి కాదు.

అయితే బాల సాహిత్యానికి లక్ష్యమేమిటి? పిల్లలు మానసికంగా ఆరోగ్యంతో ఎదగడానికి, నైతిక విలువలు పెంచుకుని భావి పౌరులుగా, నాయకులుగా, సమాజానికి ఉపయోగపడే విధంగా తయారవడానికి చిన్నతనం నుండి ఉపయోగపడే ఒక సాధనంగా వుండడమే ఈ సాహిత్యం లక్షణం. అలా చదివించాలంటే బాల సాహిత్యం విజ్ఞానాన్ని అందిస్తూ, వినోదం కూడా కలిగించే విధంగా ఉండాలి. అలా వినోదమే లేకపోతే పిల్లలు చదవడానికి, వినడానికి ముందుకొచ్చేదెలా? మేము మూడో తరగతిలో ఉన్నప్పుడు (సుమారు అరవై ఏళ్ళ క్రితం) మాకు నేరెళ్ళ మేష్టారు క్లాసు టీచర్. ఆయన మధ్యాహ్నం మూడింటి వరకూ పాఠం చెప్పి, మూడింటికి స్కూల్లో అందరి పిల్లలకి సీరియల్ కథలు చెప్పేవారు. కాశీమజిలీ కథలు, బాల నాగమ్మ, మాయల ఫకీరు.. ఎన్నో కేరెక్టర్లు, ఎన్నెన్నో కథలు.. ఒక వారం, ఒక నెలలో అయ్యేవి కావు. ఆ కథలు వినడానికి ఎంత అసహనంగా వేచి ఉండేవాళ్లం! కథలు రాసేవాళ్ళే కాదు, చెప్పేవాళ్ళు కూడా కావాలి. అప్పుడే ఆ కథలకు ప్రయోజనం. అప్పటి మేస్టారిని ఈ రోజుకీ మర్చిపోలేకపోవడానికి ఆ కథలు, అవి చెప్పిన ఆయన కదా!

పంచతంత్రం సుమారు క్రీస్తు శకం మూడు, అయిదవ శతాబ్దాల కాలంలో (ఇదమిద్ధంగా తెలియదు) విష్ణుశర్మ అనే ఒక గురువు సంస్కృతంలో రాసిన గ్రంథం. ఈ రోజుకీ మనం పంచతంత్ర కథలను తల్చుకుంటున్నామంటే, అది ఆ కథలు చెప్పిన తీరులోని గొప్పదనం కాదూ! ఇది 5 విభాగాలతో కూడిన 84 కథల సంపుటి. కొన్ని బృహత్కథ నుండి కూడా తీసుకుని, తను అల్లిన కథలతో విష్ణుశర్మ తయారు చేసినదీ గ్రంథం. పంతొమ్మిదవ శతాబ్దానికి చెందిన పరవస్తు చిన్నయసూరి ఆ కథలను తెలుగులోకి తర్జుమా చేశాడు. ఆయన తన గ్రంథానికి 'నీతి చంద్రిక' అని పేరు పెట్టాడు. చిన్నయగారే కాకుండా, మరింకెంతో మంది అనువదించారు. తెలుగులోకే కాదు, ఈ గ్రంథం ప్రపంచంలో చాలా భాషలలోకి అనువదించబడింది. 570 CE లో బోర్జుయా చే పహ్లావీ లోకి, 750 CE లో అరబిక్ లోకి, 12 వ శతాబ్దంలో

పర్షియన్ భాషలోకి, 1570 లో ఆంగ్లంలోకి రకరకాల పేర్లతో అనువదించబడి ప్రఖ్యాతి కాంచింది. (వికీపీడియా). ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. అరబిక్ ప్రతిని మూలంగా చేసుకుని ఎన్నో యూరోపియన్ భాషలలోకి కూడా ఈ గ్రంథం అనువదించబడింది. అయితే ఆయా సంస్కృతుల ఆధారంగా కొన్ని మార్పులు చేర్పులు చేయబడ్డాయి.

విష్ణుశర్మ తన రాజుకున్న ముగ్గురు కొడుకులకూ చదువు, ప్రపంచ జ్ఞానం, పరిపాలనలో మెళుకువలు ఇస్తూ, నీతి బోధ చేసే కథల రూపంలో చెప్పే పద్ధతిని ఎన్నుకున్నాడని అందరికీ తెలిసినదే. అయితే ఈ కథల ప్రత్యేకత ఏమిటి? రామాయణ భారత గ్రంథాలలాగా 1,500 సంవత్సరాలుగా భారతీయుల్ని, మిగతా ప్రపంచవాసుల్ని అలరించగలిగే సమర్థత ఉన్న ఈ పంచతంత్రంలో ప్రత్యేకత ఏమిటి? నేను పైన చెప్పిన మా మాస్టారు అవలంబించిన పద్ధతి – కథ చెప్పిన తీరు ముఖ్యమైనది. కథ చదివినదాని కంటే ఎవరైనా చెపితే, చెప్పిన తీరుని బట్టి మన మనస్సులలో నిలిచిపోతుంది. అదే జరిగింది ఇక్కడ కూడా.

అయిదు భాగాలలోనూ మొదటి నాలుగూ (మిత్రభేదము, మిత్రలాభము, కాకోలూకీయమ్ – కాకులు, గుడ్లగూబలు, లుబ్ధనాశము - సంపదలను కోల్పోవడం), కేవలం జంతువులతో చెప్పిన, చెప్పించిన కథలు కాగా, చివరిది అసంప్రేక్షకారిత్వము (చెడు చేయకోరడం) లో మానవులు ప్రధాన పాత్రలు. కథలన్నీ, సులభంగా వుండి, అందరికీ అర్థమయేలా, హృదయానికి హత్తుకునేలా ఉంటాయి. పక్షులు, జంతువులు మాట్లాడడం, మనుషులలాగే ప్రవర్తించడం పిల్లలని, పెద్దలని ఆకర్షిస్తాయి. కథలో కథలు, ఆ కథల్లో కథలు. ప్రతి కథా ఏదో ఒక సందేశాన్ని ఇస్తున్నా, ఆ సందేశానికి ఒక సందర్భం ఉంటుంది. అంతే కాదు, కథ ఎవరో ఒకరు చెప్తారు. అదీ అక్కడ విశేషం.


చిన్నయసూరి గారు నాలుగు విభాగాలుగా అనువదించారు. మిత్రలాభం, మిత్రభేదం, విగ్రహం, మరియు సంధి. ఇంకొక విషయమేమిటంటే, కథలను వాటి పేర్లను బట్టి సులభంగా జ్ఞాపకం పెట్టుకోవచ్చు. ఉదాహరణకు, పేరాశ పనికిరాదని చెప్పే 'బ్రాహ్మణుడు–పులి' కథ, బుద్ధిహీనులైన కొండముచ్చులకు హితవు చెప్పబోయి ముప్పు తెచ్చుకున్న కుందేలు కథ (కొండముచ్చు–కుందేలు కథ), పొగరుబోతు పావురం బలమైన డేగను ఢీ కొని చెడిపోయిన కథ (డేగ–పావురము కథ), ఇలా ప్రతి కథలోని ముఖ్య పాత్రలతో ఆయా కథలను గుర్తించవచ్చు. పిల్లలకు ఎలక పావురాల కథ అనంగానే ఆ కథేమిటో, అది చెప్పే నీతేమిటో ఇట్టే తెలిసిపోతుంది.

నీతిచంద్రిక కథలన్నీ, ఒకప్పటి చందమామలో ధారావాహికంగా వచ్చాయి. ఒక తరం పిల్లలు చందమామ మాసపత్రిక వస్తోందంటే ఆ కథలు, అలాంటి కథలు చదవడం కోసం చూసే ఎదురు చూపులు ఇన్నీ అన్నీ కావు.

ఒకటిన్నర వేల సంవత్సరాల తర్వాత కూడా ప్రపంచ వ్యాపితంగా పిల్లలను అలరించిన పంచతంత్ర కథలు, అవి చెప్పబడిన తీరు వల్లనే అందరి మనసుల్లో ఉండిపోయాయి.

**శాయి రాచకొండ, హ్యూస్టన్**

# కథాపుస్తక పరిచయం




## పాండీబజార్ కథలు

చెన్నై టీనగర్లో పాండీబజార్ అంటే తెలియని వారు ఉండరు. సినిమా పరిశ్రమ వాళ్లందరు అక్కడి చేరి కష్టసుఖాలు, కబుర్లు, ఊసులు ఆడుకునే ఓ రచ్చబండ! మరి అలాంటి చోట.. కథలు ఉండవా.. అవే ఇవి! అందురలోనూ ప్రముఖ సినీ రచయిత శ్రీ భువనచంద్రగారి కలం నుండి జాలువారిన 10 కథలు. వంగూరి ఫౌండేషన్, అమెరికా వారు, ఆగస్టు 2025లో ప్రచురించిన ఈ కథాసంపుటి వెల రు.120/-.

ప్రతులు


అచ్చంగా తెలుగు, హైదరాబాద్ (ఫోన్ : 8558899478) మరియు నవోదయ బుక్ హౌస్, ఆర్య సమాజ మందిర్, బడి చోడి, హైదరాబాద్., దగ్గర లభ్యమవుతాయి.

## కథ కంచికి..

నిత్య జీవితంలో ఎదురయ్యే వివిధ సంఘటనలు, అనుభవాలు, ఆలోచనలు, సామాజిక అంశాలను కథా వస్తువులుగా తీసుకుని, సరళమైన శైలిలో శ్రీమతి రాధిక మంగిపూడి గారి 18 కథల సమాహారం. వంగూరి ఫౌండేషన్, అమెరికా వారు, ఆగస్టు 2025లో ప్రచురించిన ఈ కథాసంపుటి వెల రు.120/-.

ప్రతులు

అచ్చంగా తెలుగు, హైదరాబాద్ (ఫోన్ : 8558899478) మరియు నవోదయ బుక్ హౌస్, ఆర్య సమాజ మందిర్, బడి చోడి, హైదరాబాద్., దగ్గర లభ్యమవుతాయి.



## అమెరికా ఇల్లాలి ముచ్చట్లు




ప్రముఖ కథా రచయిత్రి శ్రీమతి దాశిక శ్యామలదేవి గారు గత 50 సంవత్సరాలుగా అమెరికాలో ఉంటూ.. అక్కడి అనుభవసారంతో అక్కడ ఇక్కడ జీవనవిధానాలకి దిశానిర్దేశం చేయగల కథావస్తువులతో వ్రాసిన కథలలో 22 కథల సంపుటి.

వంగూరి ఫౌండేషన్, అమెరికా వారు, ఆగస్టు 2025లో ప్రచురించిన ఈ కథాసంపుటి వెల రు.200/-.

ప్రతులు

అచ్చంగా తెలుగు, హైదరాబాద్ (ఫోన్ : 8558899478) మరియు నవోదయ బుక్ హౌస్, ఆర్య సమాజ మందిర్, బడి చోడి, హైదరాబాద్., దగ్గర లభ్యమవుతాయి.

## మనుగడ




సింహప్రసాద్ గారి ఈ కొత్త కథా సంపుటి అక్టోబరు 14, 2025న ప్రఖ్యాత సాహితీవేత్త, ప్రతిభామూర్తి పురస్కార గ్రహీత శ్రీ విహారి గారు రవీంద్రభారతిలో ఆవిష్కరించారు.

ఆసక్తి గలవారు 9849061668 కు 150 రూపాయలు పంపిస్తే పోస్ట్ ఖర్చులు భరించి కాపీ పంపిస్తారు.

# వినదగునెవ్వరు చెప్పిన..

అక్టోబర్ సంచిక ఎప్పటిలాగే అంతర్జాలంలో కనిపించిన రోజే చదివాను. ఈ సంచికలో ప్రత్యేకంగా ఆకట్టుకున్న శీర్షికలు..

జ్యేష్ఠగారిని కథా మార్గదర్శిగా తలుచుకోవడం: వారి ఒక కథ "గాడిద బొమ్మ" ని ప్రచురించటం! గాడిద బొమ్మ కథలో హాస్యాన్ని నేపథ్యంగా ఒక క్లిష్టమైన అంశాన్ని చెప్పటం జరిగింది. కథ ముగింపులో కొంచెం కరుకుగానే చెప్పారు. నకిలీ సిద్ధాంతాలు చెప్పి, ప్రజలని వెనక దారిలో మోసం చేసేవారికీ.. భక్తి అనే బలహీనతతో ప్రజలని మభ్యపెట్టి డబ్బు చేసుకునే వారికీ ఏమీ తేడా లేకపోయినా ఒక వైపు ఏదో లాభాన్ని చూసుకునే ఆ వ్యవస్థని వాడుకోవటమే! ఈ కథలో రెండు వర్గాలపైనా ఎన్నో వాస్తవికమైన విసుర్లు ఉంటాయి

రావిశాస్త్రిగారి కథా పరిచయం: సమీక్షకులు చెప్పినట్టు కథ ఏమైనా చెప్పే విధానంలో వైవిధ్యమైన శైలితో రావిశాస్త్రిగారు అలరిస్తారు. కథని ఇంతకు ముందే చదివాను కనుక ఈ పరిచయాన్ని మరింతగా ఆస్వాదించాను.

ఇది కాక పది కథలూ చదివాను. కథలన్నీ బాగున్నా, నా మనసుకి హత్తుకున్న కథలు పూనిక, నేను రాధనోయి, ఇది కదా ప్రేమ. విచిత్రంగా ఈ కథలు అదే వరసలో ప్రచురితం కావటం.

'పూనిక' కథ చాలా బావుంది. కథనం, ముగింపు చాలా ఆకట్టుకుంటుంది. కథపై నాకున్న వ్యక్తిగత అభిప్రాయం కూడా చెప్పాలి. ఒక మంచి దంపతులకి పరమ స్వార్ధపరుడైన కొడుకు పుట్టాడంటే పెంపకంలో ఏదో లోపం ఉన్నట్టే కదా! మరొక కోణంలో "ఈ ప్రేమ పేరుతో సంఘాన్ని ఎదిరించి... అని గొప్పగా మన నవలల్లో, సినిమాల్లో చూపించే ప్రేమలతో స్వార్ధమే ఎక్కువ" అని నాకు అనిపించింది. ప్రేమ పేరుతో అందరినీ వదులుకుని పెళ్లి చేసుకున్నవాడు, తర్వాత సహచరిని కూడా ఇంకేదో పేరుతో ఎందుకు వదులుకోకూడదు? ఇన్ని విధాలుగా ఆలోచింపజేసిందంటే కథ విజయం సాధించినట్టే.

'నేను రాధనోయి' కథ నేను 2014 లో ఇదే నేపథ్యంలో రాసిన ఆరాధన కథని గుర్తుకుతెచ్చింది. కొన్ని బంధాలలో భౌతికవాదం ఏమీ ఉండదని చెప్పిన కథ! ఇలాంటి అనుభూతులు ప్రేరణలు మనందరి జీవితాలలో ఎక్కడో ఒకచోట కలిగే ఉంటాయి.

'ఇది కదా ప్రేమ' కూడా కొంత వరకూ 'నేను రాధనోయి' తో పోలిక కలిగి ఉంది. కానీ కథని నడిపిన విధానం వేరుగా ఉంది.

వైవిధ్యమైన అంశాలతో ఎంతో శ్రమతో పత్రికని నడిపిస్తున్న యాజమాన్యానికి, సంపాదకవర్గానికి ధన్యవాదాలు.

**రాజమోహన్ ఇవటూరి**

డా పూడిపెద్ది శేషు శర్మగారు అందించిన కథ "రెండో బాణం" చాలా అందంగా ఉంది. కథాంశం చాలా చక్కగా రక్తి కట్టించారు, కానీ కేవలం బుద్ధ భగవానుడు బోధించిన "రెండో బాణం" అనే సూక్తిని సవివరంగా తెలియజేస్తూ ముగించడం వల్ల కథ సంపూర్ణంగా అనిపించలేదు. శ్రీమతి భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు చాలా మధురంగా మరియు భావయుక్తంగా వినిపించారు.

**వై సత్యనారాయణ**

'రెండవ బాణం' కథ బాగుంది కానీ కథ ముగింపు లేకుండా మధ్యలో ఆపేసినట్లు అనిపించింది. శ్రీమతి జ్యోత్స్న గారు చక్కని స్వరంతో బహుచక్కగా చదివి వినిపించారు.

**కొవ్వలి భాను**

# సాయం

కోనే నాగ వెంకట ఆంజనేయులు

✆ 9290660220

***ఆ డబ్బులు నేను కావాలనే తీసుకుంటున్నాను. ఎందుకో తెలుసా? నేను కొని తీసుకువచ్చిన వాటికి డబ్బులు తీసుకోకపోతే ఆ తరువాత నుంచీ ఆవిడ నాకు ఏ పనీ చెప్పరు.. నేను డబ్బులు తీసుకోవడం లేదని! అప్పుడు ఆవిడే శ్రమపడి బయటికి వెళ్లి సరుకులు కొని తెచ్చుకోవాలి కదా. ఆవిడ బయటకు వెళ్లిన ఆ సమయంలో తాతగారిని ఎవరు చూసుకుంటారు మరి?***

ప్రతీ ఆదివారం లాగే ఆ రోజు కూడా ఉదయాన్నే లేచి పళ్లు తోముకుని, తండ్రితో పాటు నడక మైదానానికి బయలుదేరాడు అయిదో తరగతి చదువుతున్న తరుణ్. మైదానం చుట్టూ తండ్రి వాకింగ్ చేస్తుంటే తరుణ్ తన మిత్రులతో కలిసి క్రికెట్ ఆడుతుంటాడు. ఓ గంటా, గంటన్నర తరువాత మైదానం నుంచి నడుచుకుంటూ తిరిగి వస్తూ దారిలో కూరగాయలు కొనుక్కుని వస్తుంటారు తండ్రీకొడుకులు.

వాళ్ళు మైదానానికి బయలుదేరుతున్నప్పుడు పక్కింటి మామ్మగారు గేటు తీసుకుని బయటికి వచ్చారు. "బాబూ! మీరు కూరగాయలు కొనుక్కుని వస్తారు కదా! మాకు కూడా ఓ అరకిలో వంకాయలు, కొంచెం కొత్తిమీర తీసుకువస్తారా?" అని అడిగేరు. ఇలా అప్పుడప్పుడూ ఆవిడ... తండ్రితో కూరగాయలు, పచారీ సామానులు తెప్పించుకోవడం తరుణ్‌కి తెలుసు!

ఆ యింట్లో మామ్మగారూ, తాతగారు మాత్రమే ఉంటారు. వాళ్ల పిల్లలు వేరే ఊళ్లలో ఉద్యోగాలు చేస్తూ అప్పుడప్పుడూ వచ్చి వెళుతుంటారు. వీళ్ళు మాత్రం వాళ్ళ దగ్గరకు వెళ్ళకుండా తాము స్వంతంగా కట్టించుకున్న యింట్లోనే ఉండడానికి యిష్టపడతారు. ఎప్పుడైనా పిల్లల దగ్గరకు వెళ్ళినా నాలుగైదు రోజులు వాళ్ళతో గడిపి తిరిగి తమ యింటికి వచ్చేస్తుంటారు. తాతగారు బయటికి వెళ్లి పనులు చేసుకోలేని వృద్ధుడు. అప్పుడప్పుడూ మామ్మగారే అవసరం అయినప్పుడు ఆయన్ని యింట్లో ఒంటరిగా వదిలి, బయటికి వచ్చి యింటికి అవసరమైన సామానులు కొనుక్కుని వెంటనే తిరిగి వచ్చేస్తుంటారు. కొన్నిసార్లు తరుణ్ వాళ్ళ నాన్నతో చెప్పి సరుకులు తెప్పించుకుంటారు.

మైదానంలో తండ్రి వాకింగ్, కొడుకు క్రికెట్ ముగించుకుని యింటికి బయలు దేరారు. దారిలో కూరగాయలు కొనుక్కోవడానికి గుడ్డసంచీలు కూడా యింటి దగ్గరనుండే తెచ్చుకున్నారు ఎప్పటిలాగే! తమకు అవసరమైన కూరగాయలతో పాటు, పక్కింటి మామ్మగారు తీసుకు రమ్మన్న వంకాయలు, కొత్తిమీర కూడా వేరే కవర్లో వేయించుకుని యింటివైపు నడక సాగించారు. దారిలో తండ్రికి తన పాఠశాల విశేషాలూ, స్నేహితుల సంగతులు ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు తరుణ్.

తండ్రి ఎప్పటిలాగే దారిలో కనిపించిన బిచ్చగాళ్ళకు అయిదు, పది రూపాయలు దానం చెయ్యడం కూడా గమనిస్తున్నాడు తరుణ్. అవీ, యివీ మాట్లాడుకుంటూ యిల్లు చేరుకున్నారు తండ్రికొడుకులు.

వీళ్ళ రాక గమనించిన పక్కింటి మామ్మగారు బయటికి వచ్చారు. తరుణ్ తండ్రి, ఆమె తీసుకు రమ్మని చెప్పిన వంకాయలు, కొత్తిమీర ఉన్న కవర్ ఆమె చేతికి అందించాడు.

"ఎంత అయింది బాబూ?" అని ఆమె అడగగానే, 'యిరవై అయిదు రూపాయలు అయింద'ని చెప్పేడు తండ్రి. ఆమె లోపలికి వెళ్లి ఓ యిరవై రూపాయల నోటూ, అయిదు రూపాయల బిళ్ళ తీసుకువచ్చి తరుణ్ తండ్రి చేతిలో పెట్టి వెళ్ళిపోయింది.

తండ్రి అలా మామ్మగారి దగ్గర డబ్బులు తీసుకోవడం తరుణ్‌కి నచ్చలేదు. ముఖం అసహనంగా పెట్టేడు. తమ యింట్లోకి వెళ్ళగానే "నాన్నా! నువ్వు దారిలో ఎంతోమందికి సహాయం చేస్తూ, ఊరికే డబ్బులు యిచ్చేస్తుంటావు



కదా! మరి మామ్మగారి దగ్గర నుండి ఆ చిన్నమొత్తం ఎందుకు తీసుకుంటున్నావు? అలా తీసుకోవడం నాకు నచ్చలేదు నాన్నా! డబ్బులు తీసుకోకుండా మామ్మగారికి ఆ మాత్రం కూరగాయలు తీసుకురాలేవా?" అని ప్రశ్నించాడు నిష్ఠూరంగా!

తండ్రి చిన్నగా నవ్వేడు. "ఓ... నువ్వు అన్నీ గమనిస్తున్నావన్న మాట! మంచి విషయమే. చాలా సంతోషం కూడా. చెబుతాను విను. ఆ ఇంట్లో ఉన్న యిద్దరూ కూడా పెద్దవాళ్ళే. తాతగారికి ఎనభై ఏళ్ళు. మామ్మగారికి డెబ్బై అయిదు. వృద్ధుడైన ఆ తాతగారు బయటకు వెళ్ళి సామానులు, కూరగాయలు కొని తీసుకు రాలేరు కదా. ఆయన్ని వదిలి మామ్మగారు కూడా బయటకు వెళ్లి పనులు చక్కబెట్టుకోలేరు. అందుకే మామ్మగారు అవసరమైనప్పుడు పక్క యింట్లోనే ఉన్న నాకు పనులు చెబుతుంటారు. తీసుకువచ్చిన సరుకులకు డబ్బులు కూడా వెంట వెంటనే యిచ్చేస్తుంటారు కూడా!

నువ్వు నన్ను అడిగేవు కదా... వాళ్ల దగ్గర డబ్బులు ఎందుకు తీసుకుంటున్నారు అని! అవును ఆ డబ్బులు నేను కావాలనే తీసుకుంటున్నాను. ఎందుకో తెలుసా? నేను కొని తీసుకువచ్చిన వాటికి డబ్బులు తీసుకోకపోతే ఆ తరువాత నుంచీ ఆవిడ నాకు ఏ పనీ చెప్పరు... నేను డబ్బులు తీసుకోవడం లేదని! అప్పుడు ఆవిడే శ్రమపడి బయటికి వెళ్లి సరుకులు కొని తెచ్చుకోవాలి కదా. ఆవిడ బయటకు వెళ్లిన ఆ సమయంలో తాతగారిని ఎవరు చూసుకుంటారు మరి? అందుకే తీసుకువచ్చిన సరుకులకు నేను డబ్బులు తీసుకుంటున్నాను. నేను డబ్బులు తీసుకుంటున్నాను కాబట్టే, ఆవిడ అవసరం అయినప్పుడల్లా నాకు మళ్ళీ మళ్ళీ పనులు చెబుతుంటారు. ఆ డబ్బులు అయిదు రూపాయలైనా సరే నేను ఆవిడ దగ్గర నుండి తీసుకునేది అందుకే. అర్థమయిందా?" ప్రశ్నించాడు తండ్రి.

తండ్రి మొహమాటం లేకుండా మామ్మగారి దగ్గర డబ్బులు ఎందుకు తీసుకుంటాడో అర్థమైన తరుణ్ నవ్వుతూ, "అర్థం అయింది నాన్నా! ముసలివాళ్ళకు ఎన్నివిధాల సాయం చేయవచ్చునో కూడా యిప్పుడు నాకు తెలిసింది" అన్నాడు.

ప్రేమగా కొడుకు భుజం తట్టేడు తండ్రి!

# నిజాయితీపరులు!

యు.విజయశేఖర రెడ్డి

✆ 9959736475

***"అయ్యగారూ! వస్తువు దొరికిన వెంటనే మీకు తెచ్చిచ్చే లోపల పూర్తిగా చీకటి పడుతుంది. దీపాలు వెలిగించే పనికి ఆటంకం కలుగుతుంది. రహదారిలో వెళ్లే వారికి ప్రమాదాలు జరగొచ్చు, అందుకని పని పూర్తి చేసుకుని వచ్చాను" అన్నాడు రామయ్య***

జమిందారీ వ్యవస్థ ఉన్న రోజులు అవి!

జమీందారు రాఘవయ్య పార్వతీపురంలో ఉండేవాడు. అతనివద్ద శివయ్య ఎంతో నమ్మకంగా పని చేసేవాడు. తోటపనితో పాటు సాయంత్రం ఇంటికి వెళ్లే వేళ రహదారి మార్గంలో ఉన్న స్తంభాలకు అమర్చిన నూనెదీపాలను వెలిగించే కొలువు అతనిది! అతని కొడుకు రామయ్య నగరంలో చదువు పూర్తిచేసుకుని, ఇంటికి వచ్చాడు.

"జమిందారు గారితో చెప్పి మన అబ్బాయికి కొలువు ఇప్పించండి." అంది సీతమ్మ.

"మా అబ్బాయి అని సిఫార్సు చేసి ఉద్యోగం ఇప్పించడం నాకు ఇష్టం లేదు" అన్నాడు శివయ్య. "అవునమ్మా! ఉద్యోగం అన్నది స్వశక్తితో సంపాదించుకోవాలి." అన్నాడు రామయ్య.

కొన్ని రోజులకు జమీందారుగారి కూతురు వివాహం కుదిరింది. "శివయ్యా! ఈ పది రోజులూ నా వద్దనే ఉండి పనులు చూసుకో. తోటపని వేరేవాళ్లు చూసుకుంటారు. నీ కొడుకు రామయ్య ఖాళీయే కదా సాయంత్రం పూట దీపాలు వెలిగించే పని అతనికి అప్పగిస్తున్నాను." అన్నాడు జమీందారు.

"అలాగే అయ్యగారూ!" అన్నాడు శివయ్య. ఈ విషయాన్ని కొడుకుకు చెప్పి ఒప్పించాడు శివయ్య.

ఒక రోజు రామయ్య దీపాలు వెలిగిస్తుండగా రహదారిలో ఒక చిన్న చెక్కపెట్టె దొరికింది. 'రహదారిలో ఏ వస్తువు దొరికినా దానిని జమీందారుగారికి చేరవేయాలి, అది పోగొట్టుకున్నవారికి జమీందారుగారు చేరేలా చేస్తారు' అని తండ్రి చెప్పాడు. ఆ నియమం ప్రకారం రామయ్య ఆ పెట్టెను సంచిలో పెట్టుకుని, దీపాలన్నీ వెలిగించి, జమిందారు వద్దకు చేరుకుని విషయం చెప్పి ఆ పెట్టెను ఇచ్చాడు.

జమిందారు పక్కనే ఉన్న అతను, "ఇందులో విలువైన నగలు ఉన్నాయి. మీ అమ్మాయి పెళ్లికోసం చేసినవి. అవి మీకు ఇవ్వాలనే బయలుదేరాను. గుర్రపు బండిలో వస్తుండగా పొరపాటున జారి పడిపోయి ఉంటుంది" అన్నాడు నగల వ్యాపారి.

"ఈ వ్యాపారి వచ్చి రెండు గంటలకు పైగా అయ్యింది. నువ్వు ఈ పెట్టెను ఇంత ఆలస్యంగా తెచ్చావేంటి?" అన్నాడు జమీందారు.



"అయ్యగారూ! వస్తువు దొరికిన వెంటనే మీకు తెచ్చిచ్చే లోపల పూర్తిగా చీకటి పడుతుంది. దీపాలు వెలిగించే పనికి ఆటంకం కలుగుతుంది. రహదారిలో వెళ్లే వారికి ప్రమాదాలు జరగొచ్చు, అందుకని పని పూర్తి చేసుకుని వచ్చాను" అన్నాడు రామయ్య.

నగల వ్యాపారి పెట్టెను తెరిచి చూసి "అన్ని వస్తువులూ సరిగ్గా ఉన్నాయి అయ్యగారూ" అన్నాడు "నిజాయితీగా నగలపెట్టె తెచ్చివ్వడమే కాకుండా, పనిపట్ల మంచి శ్రద్ధ కూడా ఉంది అని నిరూపించుకున్నావు" అని రామయ్యను మెచ్చుకున్నాడు జమీందారు.

అనుకున్న సమయానికి జమీందారుగారి అమ్మాయి వివాహం జరిగింది. ఒక నెల తరువాత జమీందారు తన వద్ద జమాఖర్చులు వ్రాసే కొలువుకు పోటీ ప్రకటించాడు. ఆ పోటీకి సుమారు పదిమంది వచ్చారు. జమీందారు పెట్టిన పరీక్షలో రామయ్య విజయం సాధించాడు. జమీందారు రామయ్యను మెచ్చుకుని, "మీ నాన్న లాగానే నువ్వు కూడా నిజాయితీగా కొలువు చేసుకో" అన్నాడు.

"అలాగే అయ్యగారూ!" అన్నాడు రామయ్య. కొడుకుకు కొలువు రావడంతో శివయ్య, పార్వతమ్మలు ఎంతగానో సంతోషించారు!

# ఏకగ్రీవం

సుస్మితా రమణమూర్తి
✆ 9703440214

> *"సార్! ప్రెసిడెంటు పదవి కోసం, ఊరు మూడు ముక్కలైంది. మూడు వర్గాలవారు, ఊరి వారందరినీ వేరు వేరుగా కలుస్తున్నారు. లేనిపోని ఆశలు చూపిస్తున్నారు. పోటా పోటీగా పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. వారి మూలంగా ఊరు శుభ్రపడుతోంది. ఇదివరకు ఎన్నడూ లేని వారి ధోరణికి అందరూ ఆశ్చర్య పోతున్నారు!"*

ఆ ఊరిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఊరి పెద్దల పట్టుదల, కృషితోనే వచ్చింది. పట్నంకి వెళ్ళి చదువుకోలేని పిల్లలు సంతోషంగా ఊర్లోనే చదువుకుంటున్నారు. ఆ పాఠశాలలోనే ప్రెసిడెంట్ గారి అబ్బాయి ఆనంద్, పనిమనిషి రంగమ్మ కూతురు లక్ష్మి, మూడో క్లాసులో ఉన్నారు. మూడు నెలల పరీక్షలలో లక్ష్మి, ఆనందులకు తెలుగు, ఇంగ్లీషు, లెక్కలలో సమానంగా మార్కులు వచ్చాయి.

'ఈసారి ఎలాగైనా అన్ని పరీక్షలలో లక్ష్మి కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలి' ఆనంద్ నిర్ణయం అది.

"క్లాసులో అందరి కంటే నువ్వే ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలిరా!" ఆనంద్ తండ్రి కొడుకుతో చెప్పిన మాటలు అవి!

'మా సిన్ననాడు ఈడ బడే నేదు. మాకెవరికీ అచ్చరం ముక్క రాదు. మా లచ్చికి సదువు బాగా రావాల తల్లే!' కూతురు లక్ష్మి కోసం రంగమ్మ మనసులో ప్రార్థన అది!

★★★

పాఠశాలలో అన్ని తరగతులకు అర్ధ సంవత్సరం పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షల నిర్వహణలో టీచర్లందరూ తీరిక లేకుండా ఉన్నారు. అన్ని తరగతులలో బెంచీకి ఇద్దరిని కూర్చోబెట్టి, టీచర్లు పరీక్షలు రాయిస్తున్నారు. పిల్లలు పరీక్షలు ఎలా రాస్తున్నారో.. హెడ్ మాస్టారు జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారు.

ఆనంద్, లక్ష్మి బెంచీకి ఇటొకరు, అటొకరు కూర్చుని ఆఖరు పరీక్ష 'తెలుగు' రాస్తున్నారు. లక్ష్మికి దాహం వేసింది. మాస్టారుకి చెప్పి, గదిలో మూలనున్న కుండలో నీరు తాగి వచ్చింది. రాయడానికి పెన్సిలు తీసుకుంది. ముల్లు విరిగిపోయి ఉంది. తను తెచ్చుకున్న రెండో పెన్సిలుకి కూడా ముల్లు విరిగి ఉండటం చూసి పెద్దగా ఏడ్వ సాగింది. పేపరు చూస్తున్న టీచరు, లక్ష్మి ఏడుపుకి చిరాగ్గా తలెత్తి చూసారు.



"సార్! వీటి ముల్లులు ఇందాకటి దాకా బాగున్నాయి. ఇప్పుడేమో ఇరిగి పోనాయి!" ఏడుస్తూ చెప్పింది లక్ష్మి.

"పరీక్షకు వచ్చే ముందు చూసుకోవాలి కదా? బయటకెళ్ళి చెక్కుకుని రా!" కోపంగా అన్న టీచరు మాటలకు, లక్ష్మి మరింతగా ఏడ్వ సాగింది.

అన్ని తరగతులను చూస్తూ వస్తున్న హెచ్.ఎమ్. ఆ గది బయట నుంచే పరిస్థితిని అర్థం చేసుకున్నారు. లక్ష్మి ఏడ్పు ఆపలేదు.

"నీవిలా ఏడుస్తుంటే పరీక్ష రాస్తున్న అందరికీ ఇబ్బంది కదా? బయటకు పద!" అంటూ లక్ష్మిని హెచ్.ఎమ్. గారు బయటకు తీసుకువెళ్ళారు. ఆనంద్ లోలోన సంతోషించాడు.

'అనుకున్న ప్రకారం లక్ష్మికి టైము వేస్ట్ అవుతుంది. తప్పకుండా ఈ పరీక్షలో తనకే మార్కులు ఎక్కువ వస్తాయి' అని ఆనంద్ అనుకుంటూ పరీక్ష సంతోషంగా రాస్తున్నాడు. ఆనంద్ హావభావాలు హెచ్.ఎమ్ గమనించారు.

బయటకు వెళ్ళిన లక్ష్మి తిరిగి రాలేదు. అన్ని తరగతులకు పరీక్షా సమయం ముగిసింది. టీచర్లు అందరూ పేపర్ల కట్టలతో హెచ్.ఎమ్. గారి గదిలోకి వెళ్ళారు.

"మీరు చెప్పిన సమయంకే అన్ని ప్రశ్నలకు జవాబులు రాసాను సార్! మీరిచ్చిన పెన్సిళ్ళు బల్లపై ఉంచాను సార్!" అంటూ, ఆ గదిలో తను రాసిన పరీక్ష పేపరు, హెచ్. ఎమ్. గారికి ఇచ్చింది లక్ష్మి.

ఆ పేపరు లక్ష్మి తరగతి కట్టలో పెట్టారు వారు.

పరీక్షలు రాసిన వెంటనే పిల్లలు వెళ్ళిపోయారు. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత హెచ్ ఎమ్ గారు టీచర్లను సమావేశపరిచారు.

"ఈ సమావేశంలో జరిగిన పరీక్షల గురించి, పాఠశాల అభివృద్ధి గురించి, పిల్లల మనస్తత్వాల గురించి కొన్ని విషయాలు చర్చించుకుందాం" అంటూ వారు అందరి వేపు చూసారు.

"పాఠశాలకు సంబంధించి అంతా బాగుంది కదా సార్.. ప్రత్యేకంగా చర్చించుకోడానికి ఏముంది?" ఓ టీచరు ఆశ్చర్యంగా అడిగిన ప్రశ్నకు హెచ్. ఎమ్. మందహాసం చేసారు.

"అవును! అన్ని వ్యవహారాలు సజావుగానే సాగుతున్నాయి. అయినా కొన్ని విషయాలు భూతద్దంలోంచి చూడక తప్పదు!" హెచ్ ఎమ్ గారి ధోరణి ఎవరికీ అర్థం కాలేదు.

"పాఠశాల ప్రారంభమై అయిదేళ్ళు అయింది. మొదట్లో కంటే ఇప్పుడు పిల్లలు బాగా వస్తున్నారు. ఈ ఊర్లో పేదవారే ఎక్కువ. బాగా ఉన్నవారు తక్కువే ఉన్నారు!"

"ఇవన్నీ మాకు తెలుసండీ!"

"ఇక్కడ ఒక ముఖ్య విషయం అందరూ గమనించాలి. దిగువ తరగతి పిల్లలు అణకువగా ఉండి, బాగా చదువుకుంటున్నారు. ఉన్నవారి అహంకారం.. అది వారి పిల్లలలో కూడా ఉండటం సహజం. మనం ఇరు వర్గాల వారిని సమదృష్టితో చూడాలి. భేద భావం అసలు చూపకూడదు!"

"ఈ ఉపోద్ఘాతం ఎందుకు సార్! మీ మనసులో మాటేమిటో చెప్పండి!" ఒక టీచరు విసుగ్గా అడిగారు.

"ఈ ఏడాది చివరలో ఊరి ప్రెసిడెంటుగారి హయాం అయిపోతుంది. ఈసారి ఏకగ్రీవం కాకపోవచ్చు. పెద్ద వారిలోనే బేధాలు కనిపిస్తున్నాయి. వారి రాజకీయాలకు మనం దూరంగా ఉండాలి. మన ధ్యాసంతా స్కూలు అభివృద్ధిపైనే ఉంచాలి!"

"అర్థం అయింది సార్!" అన్నారంతా.

"పరీక్షలు బాగా జరిగాయి. నా పర్యవేక్షణలో కొన్ని విషయాలు గమనించాను!"

టీచర్లు ఆసక్తిగా వింటున్నారు.

"పిల్లలకు ప్రశ్నాపత్రాలు, జవాబులు రాయడానికి పేపర్లు ఇచ్చేసి, టీచర్లు.. ఏ పేపరో, పుస్తకమో చదువుతూ, కాలక్షేపం చేయకూడదు. పరీక్ష రాస్తున్నప్పుడు పిల్లలను జాగ్రత్తగా గమనించాలి!" టీచర్లు ఆశ్చర్యపోతూ హెచ్.ఎమ్ గారి మాటలు వింటున్నారు.

"తోటివారి పెన్సిళ్ళ ముల్లులు విరగ్గొట్టిన పిల్లలను గమనించాను. పెన్సిలు బాక్సులు మాయం చేసిన వారినీ చూసాను. ఇటువంటి వాటిని తరగతిలో టీచర్లే సరిచేసి ఉంటే బాగుండేది"

హెచ్.ఎమ్ గారు కొన్ని నిముషాలు టీచర్ల వేపు తీక్షణంగా చూసారు. కొందరు తలలు దించుకున్నారు.

"ఇకమీదట ఇలాంటి విషయాలలో అందరూ జాగ్రత్తగా ఉండాలి"

"మనది ప్రాథమిక పాఠశాల సార్! మీ మాట కాదనలేక అందరం పబ్లిక్ పరీక్షలంత హడావుడిగా పరీక్షలు జరిపించాం!"

"అవునవును!" ఒక టీచరు సమర్థింపు

"మీరు రిటైర్ కాబోతున్నారు. పిల్లల గురించి, ఊరు పెద్దల రాజకీయాల గురించి పట్టించుకోకండి సార్! ఆ విషయాలు మేము చూసుకుంటాం!" సీనియర్ టీచరు నెమ్మదిగా చెప్పారు.

"మనమంటే వేరేచోట నుంచి వచ్చాం. సారేమో ఈఊరిలో పుట్టి పెరిగినవారు. పైగా వారి నాన్నగారిచ్చిన స్థలంలో కట్టిన పాఠశాలాయె! మనలా అంటీ ముట్టనట్టు వారెలా ఉండగలరు! వారి ఆలోచనలు.. ఎప్పుడూ స్వంతూరు అభివృద్ధి, పేద పిల్లల చదువు గురించే! అందుకనే పేద పిల్లలకు పలకలు, బలపాలు, పెన్సిళ్ళు ఎక్కాల పుస్తకాలు కొనిస్తున్నారు!"

"అంతేనా.. సెలవు దినాల్లో క్రమం తప్పకుండా పిల్లల ఇంటికి వెళ్ళి, పెద్దవారికి పరిసరాల శుభ్రత గురించి జాగ్రత్తలు చెబుతున్నారు కూడా!" అలా తలొకరు తలో విషయం చెపుతున్నారు.

టీచర్ల మాటలకు హెచ్.ఎమ్ గారు మౌనం వహించారు. వారి మౌనం టీచర్లలో ధైర్యాన్ని నింపింది. దానితో వారు తమకు తెలిసిన విషయాలు చెప్పడానికి నిర్ణయించుకున్నారు.

"సార్! ప్రెసిడెంటు పదవి కోసం, ఊరు మూడు ముక్కలైంది. మూడు వర్గాలవారు, ఊరి వారందరినీ వేరు వేరుగా కలుస్తున్నారు. లేనిపోని ఆశలు చూపిస్తున్నారు. పోటా పోటీగా పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. వారి మూలంగా ఊరు శుభ్రపడుతోంది. ఇదివరకు ఎన్నడూ లేని వారి ధోరణికి అందరూ ఆశ్చర్య పోతున్నారు!" సీనియర్ టీచరు చెప్పిన దానికి తనకు తెలుసన్నట్లు తలూపారు హెచ్.ఎమ్ గారు.

"పిల్లల సంఖ్య పెరిగిందని మన ప్రయత్నాలు ఆపేయకూడదు. ఇంకా కొందరు బడిలో చేరని వారున్నారు. ఈ ఆదివారం మనం వారి తల్లిదండ్రులను కలిసి ఒప్పించాలి. వారి పిల్లలు కూడా చేరేలా చేయాలి" హెచ్.ఎమ్ గారి మాటలకు అందరూ తమ సమ్మతి తెలియజేసారు.

కొందరు మాత్రం 'పుట్టిన గడ్డపై మమకారం! వీరు రిటైరైనా ఊరి బాగు కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉంటారు' మనసులో అనుకున్నారు.

కాలం పరుగులు తీసింది. హెచ్.ఎమ్ గారు రిటైరు అయ్యారు. ప్రసిడెంటుగారి హయాం త్వరలో ముగియనుంది. ఎప్పటిలా ఎవరో ఒకరు ఏకగ్రీవం అయితే బాగుంటుందన్న ఆలోచనైతే అందరిలో ఉంది గాని, అలా జరిగే సూచనలు కనిపించటం లేదు.

రోజులు గడుస్తున్నాయి. మూడు గ్రూపుల వారిలో ఎలాంటి మార్పులేదు.

ఊరు మంచి కోరి, కొన్ని పండు తలకాయలు గుమికూడాయి. పరిస్థితులను ఆకళింపు చేసుకున్నాయి. ఏకగ్రీవం కోసం బుర్రలు వేడెక్కించుకున్నాయి. మూడు గ్రూపుల వారితో చర్చలు జరిపాయి. 'మేమంటే మేమే' అంటూ బిగుసుకు పోయాయి సమూహాలు.

ముదుసలుల దీర్ఘాలోచనల్లోంచి ఓ వెలుగురేఖ ఉద్భవించింది. చివరి ప్రయత్నంగా మరోసారి మూడు గ్రూపులకు ధైర్యంగా ఓ సూచన చేసింది.

"మీ అందరికీ ఆమోదయోగ్యమైన ఎవరినైనా.. ఊరు బాగుకోరే మనిషిని, ఈసారి ప్రెసిడెంటుని చేస్తే, మీ పెద్దరికానికి గౌరవం పెరుగుతుంది. ఏకగ్రీవం అవుతుంది. అలా కాకుంటే మీ ముగ్గురు లాటరీ పద్ధతి పాటించండి!"

పండు తలకాయల సలహా మేరకు, అందరూ తీవ్రంగా ఆలోచించారు. అందరి ఆలోచనల్లో విశ్రాంత జీవనం గడుపుతున్న హెచ్, ఎమ్. గారు చోటుచేసుకున్నారు.

'ఊరు రాజకీయాలు పట్టించుకోని మనిషి వారు. పదవీ వ్యామోహం లేనివారు. వారితో కాదనిపించడం సునాయాసం!' అందరిదీ అదే భావన కాగా, పండు తలకాయలతో కలసి హెచ్.ఎమ్ గారిని మూడు గ్రూపులు కలిసాయి. తమ అభిప్రాయం తెలియజేసాయి. అందరూ వారు తప్పకుండా కాదంటారనే ధీమాలో ఉన్నారు. చీటీల ద్వారా తమ అదృష్టాన్ని తెలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. " "ఊరు బాగు కోరి పెద్దలంతా ముందుకి వచ్చి అడిగినప్పుడు, అందరి మాట గౌరవించడం సభ్యత, సంస్కారం కనుక అంగీకరిస్తున్నాను!" హెచ్.ఎమ్ గారి సమ్మతికి అందరూ నివ్వెరపోయారు.

సమస్య పరిష్కారమైంది. 'ఈసారి ఇలా కానిద్దాం' స్వగతంలా అనుకుంటూ పండు తలలతో బాటు, అందరూ హెచ్.ఎమ్ గారికి అభినందనలు తెలియజేసారు.

పండు తలకాయలు ముందుగానే పాఠశాల టీచర్ల సహాయంతో హెచ్.ఎమ్. గారిని బలవంతంగా ఒప్పించారన్న విషయం ఎవరికీ తెలియని నిజం!

# తేనెటీగలు లేకపోతే ..

వడ్డేపల్లి వెంకటేశ్

***వర్షాలు పడక కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. రాజ్యం సంక్షోభం లోకి వెళ్ళింది.***
***మేధావులు జరిగిన నష్టాన్ని రాజుకు వివరించారు. "ప్రకృతిలో ఏ జాతి లేకపోయినా అనూహ్య మార్పులు జరుగుతాయని, తేనెటీగలు కనుమరుగు కావడం అరిష్టమని" చెప్పారు.***

దేవరకొండ దుర్గాన్ని పాలించే ప్రతాపసేనుడు ఒక రోజు వేటకు వెళ్ళాడు.

అడవి అంతా కలయతిరుగుతూ అలసిపోయాడు. ఒక్క జంతువూ దొరకకపోవడంతో నిరాశ చెంది ఒక చెట్టు కింద విశ్రాంతి తీసుకోవడానికి ఉపక్రమించాడు.

చెట్టుపైన ఒక తేనెతుట్టె రాజును ఆకర్షించింది. తేనె రుచిని ఆస్వాదించాలని మనసు ఉవ్విళ్లూరింది.

వెంటనే, "ఓ తేనెటీగలారా... ఒక రాజుగా నేను మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాను. తేనెను నాకు అందివ్వండి" అన్నాడు.

అందుకు తేనెటీగలు "ఓ రాజా! మేము కష్టపడి సేకరించిన తేనెను మీకు ఇవ్వము!" అని ఖరాఖండిగా చెప్పాయి.

అందుకు ఆగ్రహించిన రాజు, "రాజు మాటనే ధిక్కరిస్తారా?" అంటూ రాళ్ళను తేనెతుట్టె పైకి విసిరాడు.

ఆగ్రహించిన తేనెటీగలు రాజుపై విచక్షణారహితంగా దాడి చేశాయి. దాంతో భయపడిన రాజు, భయంతో రాజ్యం వైపు పరుగులు తీశాడు.

రాజ్యానికి చేరుకున్న రాజు, తేనెటీగలపై కోపం పెంచుకున్నాడు. తేనెటీగలను నామరూపాలు లేకుండా చేయాలని నిర్ణయించుకున్నాడు.

మరునాడు అడవిలోని పూలమొక్కలను నాశనం చేయాలని భటులను ఆదేశించాడు. భటులు రాజుగారి ఆదేశాలను అమలు చేశారు. దాంతో తేనెటీగలకు మకరందం దొరకక కొన్నాళ్ళకు నశించాయి.

కానీ తేనెటీగల అంతర్ధానం పర్యావరణంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది.

మొక్కల పుట్టుక ఆగిపోయింది. ఆహార గొలుసు తెగిపోయి ప్రకృతిలో సమతుల్యత తగ్గిపోయింది. తద్వారా అటవీసంపద నాశనం అయ్యింది.

వర్షాలు పడక కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. రాజ్యం సంక్షోభంలోకి వెళ్ళింది.



మేధావులు జరిగిన నష్టాన్ని రాజుకు వివరించారు. "ప్రకృతిలో ఏ జాతి లేకపోయినా అనూహ్య మార్పులు జరుగుతాయని, తేనెటీగలు కనుమరుగు కావడం అరిష్టమని" చెప్పారు.

రాజు తన తప్పు తెలుసుకున్నాడు.

కోపం ఎంతటి అనర్థానికి దారి తీసిందో... ప్రత్యక్షంగా అనుభవంలోకి వచ్చింది. వెంటనే పక్క రాజ్యంలోని అడవుల నుండి తేనెటీగలను సేకరించి అడవుల్లో వదిలారు. కొత్తగా పూలమొక్కలను నాటారు. కొన్నాళ్ళకు అడవికి పూర్వవైభవం వచ్చి పచ్చగా మారింది. వర్షాలు సకాలంలో పడ్డాయి. రాజ్యం సుభిక్షంగా మారింది.

# కోతి లౌక్యం

మహంకాళి స్వాతి
✆ 89197 73272

***"ఈ మామిడిపండ్లు ఇప్పుడే తెంపినట్లు చాలా తాజాగా ఉన్నాయి!" అంటూ ఏనుగు వద్ద మామిడిపండ్లు,***
***"ఈ క్యారెట్లు ఇప్పుడే తవ్వి తీసినట్లు శుభ్రంగా ఉన్నాయి!" అంటూ ఎలుగుబంటి వద్ద క్యారెట్లు,***
***"ఈ చేపలు ఇప్పుడే పట్టి తెచ్చినట్లు కళకళలాడుతున్నాయి!" అంటూ నక్క దగ్గర చేపలు తీసుకుంది కోతి.***

ఒక అడవిలో మర్రిచెట్టు మీద ఒక కొంగ, కోతి నివసించేవి. చెట్టు కింద బొరియలో కుందేలు నివసించేది. అవి మూడూ స్నేహంగా ఉండేవి. చెరువుగట్టు మీద కొత్తగా సంత ఏర్పడింది. సంతలో చేపలు, పండ్లు, గింజలు, కాయగూరలు, ఆకుకూరలు వంటి ఆహార పదార్థాలు అమ్ముతున్నారని వాటికి తెలిసింది.

ఓరోజు కుందేలు... ఒక సంచి తీసుకొని సంతకు బయలుదేరుతూ కొంగనీ, కోతినీ కూడా తనతో సంతకు రమ్మంది.

"మిత్రమా! నాకు నలతగా ఉంది. నాకు కొన్ని చేపలు తెచ్చిపెట్టు!" అంది కొంగ.

"తమ్ముడూ! చిన్న పని ఉంది. నాకు మామిడిపండ్లు తెచ్చిపెట్టు!" అంది కోతి.

దాంతో... కుందేలు ఒంటరిగా సంతకు వెళ్ళింది. చెరువు ఒడ్డున, ఏనుగు, ఎలుగుబంటి, నక్క... ఆహార పదార్థాలని కుప్పగా పోసి అమ్ముతూ కనిపించాయి. కుందేలును చూసి "అల్లుడూ! ఇలా రా, ఆకుకూరలు తీసుకుందువుగాని!" పిలిచింది ఏనుగు.

కుందేలు అటు పోతుండగా, "మిత్రమా! మంచి క్యారెట్లు పట్టుకు పోదువు రా!" కేక వేసింది ఎలుగుబంటి.

"సోదరా! ఇదిగో తియ్యటి పండ్లు తీసుకుందువు రా!" అరిచింది నక్క.

మూడింటి వద్ద అన్ని పదార్థాలూ ఉండటంతో, ఎవరి దగ్గర కొనుక్కోవాలో కుందేలుకు అర్థం కాలేదు. కుందేలుకు ముగ్గురూ మంచి మిత్రులే! నెత్తి గోక్కుంటూ, "ఇప్పుడే వస్తా!" అంటూ సంచి మడిచి ఇంటికి బయలుదేరింది.

దారిలో కోతి "తమ్ముడూ ! అప్పుడే అయిపోయిందా నీ సంత?" అంది.

విషయం తెలుసుకున్న కోతి, "తమ్ముడూ! ఇంత చిన్న సమస్యకు ఖాళీసంచితో తిరిగి వస్తావా! నాతో సంతకు రా! ఎలా తీసుకోవాలో చెప్తాను" అంటూ కుందేలును వెంటబెట్టుకొని సంతకు బయలుదేరింది.



వాళ్ళిద్దరూ సంతకు చేరగానే, ఆ ముగ్గురూ తమ వద్దకు రమ్మని కోతిని పిలిచాయి.

“ఈ మామిడిపండ్లు ఇప్పుడే తెంపినట్లు చాలా తాజాగా ఉన్నాయి!” అంటూ ఏనుగు వద్ద మామిడిపండ్లు,

“ఈ క్యారెట్లు ఇప్పుడే తవ్వి తీసినట్లు శుభ్రంగా ఉన్నాయి!” అంటూ ఎలుగుబంటి వద్ద క్యారెట్లు, “ఈ చేపలు ఇప్పుడే పట్టి తెచ్చినట్లు కళకళలాడుతున్నాయి!” అంటూ నక్క దగ్గర చేపలూ తీసుకుంది కోతి.

వాటిని వెంట తెచ్చుకున్న సంచిలో వేసుకుని, భుజానికి తగిలించుకుంది కుందేలు. వాళ్ళిద్దరూ తిరిగి ఇంటికి పోతుండగా దారిలో “మిత్రమా! ఈ అడవిలో అందరూ మనకి తెలిసిన వారే! ఎవరితో ఎప్పుడు ఏ అవసరం వస్తుందో మనకి తెలియదు! అందుకే ఎవరినీ నొప్పించకుండా చాతుర్యం ప్రదర్శించి, అందర్నీ సంతోషపెట్టేలా చూసుకోవాలి!” అంది కోతి కుందేలుతో.

మిత్రుడు కోతి లౌక్యానికి కుందేలు అబ్బురపడింది...

# అతిథి దేవోభవ

నీలం రాము
✆ 94419 19630

***"నేను మొక్కగా ఉండి ఇప్పుడు చెట్టుగా ఎదిగినా నా వ్రేళ్లను నేను మరవలేదు. మనం ఎంత గొప్ప వారిమైనా... మన ఎదుగుదలకు సహకరించిన కన్నవారిని, తోబుట్టువులను, బంధుమిత్రులను ఎన్నటికీ మరిచిపోవద్దు!"***

అనగనగా ఒక అడవిలో ఒక చిలుక ఉండేది. అది ఒకసారి పక్క అడవిలో ఉండే చిన్ననాటి మిత్రుడు కాకిని చూడటానికి వెళ్ళింది.

కాకి జామచెట్టు మీద గూడు కట్టుకొని ఉండేది. చిలుక జామచెట్టును వెతుక్కుంటూ... వెతుక్కుంటూ వెళ్లింది. చివరికి ఎలాగో కాకి ఇల్లు కనుక్కుంది. కానీ, సమయానికి గూటిలో కాకి లేదు. జామచెట్టు మీద వాలి అలసట తీర్చుకుంటున్న చిలుకను చెట్టు పలకరించింది.

"చిలుకా! నువ్వు ఎవరి కోసం వచ్చావూ?" అని అడిగింది.

"నా చిన్ననాటి మిత్రుడు కాకిని చూడటానికి వచ్చాను! నేను మా అడవిలో జోస్యం చెపుతుంటాను!" అంది చిలుక.

"అలాగా! కాకికి ఈమధ్యనే మృగరాజు సింహం ఆస్థానంలో వార్తాహరుడు కొలువు వచ్చింది. అడవంతా తిరిగి మృగరాజుకు వార్తలు, కబుర్లు చెప్పటం దాని ఉద్యోగం!" అంది చెట్టు.

మిత్రుడు కాకి మృగరాజు ఆస్థానంలో కొలువు చేస్తున్నాడని తెలిసి చాలా సంతోషపడింది చిలుక.

"నువ్వు మీ అడవినుంచి ఎప్పుడు బయలుదేరి వచ్చావో... ఏమిటో... తినే వేళయింది. జామపండ్లు కడుపునిండా తిను!" అంది చెట్టు.

చిలుక ఆకలితో ఎర్రటి జామపండ్లను తిన్నది.

"అడవిలో నా దగ్గరే తియ్యటి, కమ్మటి జాంపండ్లు దొరుకుతాయి!" అంది చెట్టు.

"అవును! నేనెప్పుడూ ఇంత కమ్మటి పండ్లు తినలేదు!" అంది చిలుక.

ఇంతలో మేఘాలు నల్లబడి వర్షం వచ్చింది. చిలుక వానకు తడిచి, చలితో వణికింది.

"నువ్వు వెళ్లి కాకిగూటిలో వెచ్చగా ఉండు! నాకు ఎండకి ఎండటం, వానకి తడవటం అలవాటే!" అంది చెట్టు.

చిలుక ఇంకా సంశయించడంతో, "నువ్వేమీ ఆలోచించకు! నా కొమ్మలమీద రకరకాల పక్షులు గూళ్లు కట్టుకుని జీవిస్తున్నాయి. ఆ పక్షులన్నీ నా బిడ్డలే! అవి కూడా పరోపకారం చేస్తాయి!" అంది చెట్టు.




అప్పుడు చిలుక వెళ్లి, కాకిగూటిలో వెచ్చగా కూర్చుంది. సాయంత్రానికి కాకి గూటికి వచ్చింది. గూటిలో చిలుకను చూసి, "ఎవరు నువ్వు? నా అనుమతి లేకుండా నా ఇంటిలోకి ఎలా ప్రవేశించావు?" గుర్తు పట్టనట్లు నటిస్తూ గంభీరంగా అంది కాకి.

"మిత్రమా! నన్ను గుర్తుపట్టలేదా? నీ చిన్ననాటి స్నేహితుడను!" అంది చిలుక.

"నువ్వో సామాన్యపక్షివి, నేరుగా వచ్చి నా గూట్లో ఎలా కూర్చుంటావు?" అంది కాకి.

ఇదంతా చూస్తున్న చెట్టుకు కోపం వచ్చి... కాకితో, "చిలుక నీ గూటిలోకి వెళ్లడానికి సంకోచించింది! కానీ, వాన పడటంతో నేనే నీ గూటిలో ఉండమని చెప్పాను!" అంది చెట్టు.

"నీకేం అర్హత ఉందని చిలుకను ఉండమన్నావు?" అంది కోపంగా కాకి.

"ఓ తల్లిలా, నీకు నీడని ఇచ్చాను! ఆకలైతే పండ్లను ఇచ్చాను! గూడు కట్టుకోటానికి కొమ్మను ఇచ్చాను! ఆ అధికారంతోటే, అతిథిగా వచ్చిన చిలుకను నీ గూటిలో ఉండమన్నాను!" అంది చెట్టు.

తన వలన కాకి చెట్టుతో గొడవ పడటం ఇష్టం లేని చిలుక, ఆ చీకట్లో తన అడవికి పోతానంది. చెట్టు అంగీకరించలేదు.

"కాకీ! నువ్వు వెంటనే నా చెట్టును వదిలి వెళ్ళిపో! గౌరవం పెరిగిందని గతాన్ని మరిచి, అవసరం తీరిందని సహకరించిన వారినే మరిచిన నీకు, నా వద్ద ఆశ్రయం లేదు!" కోపంగా అంది చెట్టు.

చెట్టు కోపానికి భయపడింది కాకి.

"నేను మొక్కగా ఉండి ఇప్పుడు చెట్టుగా ఎదిగినా నా వేళ్లను నేను మరవలేదు. మనం ఎంత గొప్పవారిమైనా... మన ఎదుగుదలకు సహకరించిన కన్నవారిని, తోబుట్టువులను, బంధుమిత్రులను ఎన్నటికీ మరిచిపోరాదు!" అంది చెట్టు.

కాకికి తన తప్పు తెలిసింది. చెట్టుతో "అమ్మా! నన్ను మన్నించు! మృగరాజు ఆస్థానంలో కొలువు చేస్తున్నందుకు గర్వంతో 'అతిథి దేవోభవ!' అని నీవు చూపిన బాట మరిచాను!" అంది కాకి.

చిలుకను క్షమించమని కోరి, తన గూటిలోకి తీసుకుని వెళ్ళింది. అతిథిమర్యాదలు చేసింది. మృగరాజు సింహాన్ని ఒప్పించి, మిత్రుడు చిలుకకు ఆస్థాన జ్యోతిష్కుడి పదవి యిప్పించింది. జామచెట్టు సంబరపడి, చిలుకకు గూడు కట్టుకోటానికి, కాకి పక్కనే చోటిచ్చింది.

# మృగరాజు అభినందన

పైడిమర్రి రామకృష్ణ
✆ 9247564699

***"ఆ తోటలు నావే! ఆకలితో తింటే తప్పులేదురా! కానీ, మీరు తోటను తొక్కి నాశనం చేశారు! పళ్లు సగం తిని పడేశారు. చెరుకుగడలు విరిచి పడేశారు. ఇందుకు మీకు శిక్ష ఏమిటో తెలుసా!" పెద్దగా గర్జిస్తూ అడిగింది సింహం.***

***ఆ మాటకు బుజ్జి ఏనుగు,కుందేలు పిల్లలు, కోతి పిల్లలు గజగజా వణికాయి.***

అనగనగా ఒక అడవిలో ఒక అల్లరి బుజ్జి ఏనుగు ఉండేది. ప్రతిరోజూ తన స్నేహితులైన కుందేలు పిల్లలు, కోతి పిల్లలతో ఆడుకునేది.

ఒకరోజు వాటికి... అరటి తోట, చెరుకుతోట కనిపించాయి. బుజ్జి ఏనుగు అరటితోట లోపలికి వెళ్లబోయింది. ఒక కుందేలు పిల్ల "తోట యజమాని అనుమతి లేకుండా మనం తోటలోకి ప్రవేశించకూడదు!" అంది.

కోతి పిల్ల కూడా "బుజ్జీ! తోటమాలికి విషయం తెలిసిందంటే మనల్ని శిక్షిస్తాడు!" అంది.

కానీ బుజ్జి ఏనుగు వాటి మాటలు పట్టించుకోలేదు. అరటితోటలోకి ప్రవేశించి, ఒక గెలను తెంపింది. ఆ ఏనుగుతో పాటు కుందేలు, కోతి పిల్లలు కూడా ప్రవేశించాయి! అవి... తియ్యటి, కమ్మటి అరటిపండ్లు తిన్నాయి. వస్తూ వస్తూ, బుజ్జి ఏనుగు, కొన్ని చెట్లను కాలుతో తొక్కి, తొండంతో పీకి పక్కకు పడేసింది. ఆ తరువాత, పక్కనే ఉన్న చెరుకు తోటలోకి దూరాయి. బుజ్జి ఏనుగు చెరుకుగడలు తెంపింది. అన్నీ కలిసి, చెరుకు గడలు నమిలి రసం జుర్రుకున్నాయి.

బుజ్జి ఏనుగు వస్తూ, వస్తూ కొన్ని గడలను తెంపి, కింద పడేసి, కొన్నిటిని కాలుతో తొక్కి పాడు చేసింది. ఇదంతా గాల్లో ఎగురుతున్న ఒక కాకి చూసింది. మృగరాజుకు వార్త చేరవేసింది.

తెల్లారి మృగరాజు సింహం బుజ్జి ఏనుగును, దాని స్నేహితులను గుహకు పిలిపించింది.

"ఒరేయ్! మీరు నిన్న పాడుచేసిన అరటి, చెరుకు తోటలు ఎవరివో తెలుసా?" గర్జించింది.

"తెలియదు ప్రభూ! ఆకలై అరటిపండ్లు, చెరుకుగడలు కోసుకు తిన్నాము!" నెమ్మదిగా అంది బుజ్జి ఏనుగు.

"ఆ తోటలు నావే! ఆకలితో తింటే తప్పులేదురా! కానీ, మీరు తోటను తొక్కి నాశనం చేశారు! పళ్లు సగం తిని పడేశారు. చెరుకుగడలు విరిచి పడేశారు. ఇందుకు మీకు శిక్ష ఏమిటో తెలుసా?" పెద్దగా గర్జిస్తూ అడిగింది సింహం.

ఆ మాటకు బుజ్జి ఏనుగు, కుందేలు పిల్లలు, కోతి పిల్లలు గజగజా వణికాయి.

"క్షమించండి ప్రభూ! మరోమారు తప్పు చేయం!" అంటూ సింహం కాళ్ల మీద పడ్డాయి.

మృగరాజు వాటిని క్షమించి వదిలేశాడు.

మరుసటిరోజు ఉదయం ఆడుకోటానికి బుజ్జి ఏనుగు వెళ్లింది. దాన్ని కోతి, కుందేలు తల్లులు అడ్డుకున్నాయి. తమ పిల్లలతో ఆడుకోటానికి వీలులేదని చెప్పాయి.

"నీ స్నేహం వలన, మా పిల్లలకు కూడా చెడ్డపేరు వచ్చింది!" అంది తల్లి కోతి.

"నీతో ఉండటం వలన ఏ తప్పూ చేయని మా పిల్లలను కూడా మృగరాజు మందలించాడు." అంది తల్లి కుందేలు.



ఒకరోజు రాత్రి అడవిలో అగ్గిరాజుకుంది.

బుజ్జి ఏనుగు తన మిత్రులతో పరుగున వెళ్లింది. చెట్లు మండిపోతున్నాయి. మంటను చూసి స్నేహితులైన కోతిపిల్లలు, కుందేలుపిల్లలు భయపడి దూరంగా నిలుచున్నాయి. బుజ్జి ఏనుగు ధైర్యంగా మంటల్లో చిక్కుకుని అరుస్తున్న ఎలుగుబంటి, జింకలను కాపాడింది. చెట్టుపైన ఉన్న కాకిగూటిని తొండంతో కిందికి దించింది. పక్కనే ఉన్న నదిలోని నీటిని తెచ్చి మంటలు ఆర్పింది.

కాకి మృగరాజుకు... ఈ వార్త చేరవేసింది.

మృగరాజు వెంటనే అక్కడికి చేరుకున్నాడు. బుజ్జి ఏనుగును, దాని స్నేహితులను అభినందించి ఖరీదైన బహుమతులిచ్చాడు.

సమూహంగా ఉన్నప్పుడు ఏ ఒక్కరు చెడు చేసినా, మంచి చేసినా ఫలితం మాత్రం సమూహం మొత్తానికి

ఆపాదించి చూస్తారని తెలుసుకున్న బుజ్జి ఏనుగు అల్లరి పనులు మానివేసింది!



# సాహస బాలురు

## యశస్వి గంజం

10 వ తరగతి విద్యార్థి, NSKK హైస్కూల్, ఫిరోజ్‌గూడా

> *ప్రభుత్వానికి ఆ నిధి అప్పజెప్పినందుకు, పిల్లలకు వారు*
>
> ***చదవదలచినంత వరకు ఏ చదువైనా ఖర్చును తామే భరిస్తామని ప్రభుత్వం చెప్పింది. పిల్లలిద్దరిపేరా వారి భవిష్యత్తుకు చెరో పాతిక లక్షలు బ్యాంక్‌లో జమ చేయటమే కాక, ఆ సంవత్సరం 'సాహస బాలల పురస్కారం' వాళ్ళిద్దరికీ ప్రకటించింది.***

దిలీప్, వివేక్ ఒకే పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థులు. ఒకరోజు స్కూల్‌లో వాళ్ళ సోషల్ టీచర్ వాళ్ళకి, 'ఎల్–డొరాడో' అనే నగరం గురించి చెప్పింది. వాళ్ళిద్దరూ ఎంతో ఉత్సాహంతో ఆ పాఠం విన్నారు. అది వాళ్ళకెంతో నచ్చింది.

ఆ రోజు వాళ్ళ పాఠశాల చివరి పనిదినం కావటంతో, క్లాస్ అయిపోయాక టీచర్ దగ్గరకు వెళ్ళి ఆవిడని ఎన్నో ప్రశ్నలు అడిగి తమ అనుమానాలు తీర్చుకున్నారు.

ఆరోజు నుంచి సెలవలు కావటంతో, మర్నాడు పొద్దున్నే దిలీప్, వివేక్ తో కలిసి, గ్రౌండ్‌లో ఆడుకొని ఇంటికి చేరుకున్నాడు. దిలీప్ ఇంట్లో ఒకగదిలో, ఎన్నో తరాలనుండి ఉన్న గ్రంథాలు మరియు ఇతర సామాన్లు ఉన్నాయి. దిలీప్, వాళ్ళ అమ్మ అనుమతి తీసుకొని ఆ గదిలోకి వెళ్ళాడు. అక్కడ ఉన్న వాటిని చూస్తూ ఒక తాళపత్ర గ్రంథం చూశాడు. దిలీప్ సంస్కృతం అప్పుడప్పుడే నేర్చుకుంటున్నాడు. ఆ గ్రంథంలో ఒక్కో తాళపత్రం మీద ఒక్కో శ్లోకం ఉంది. ఆ శ్లోకాలలో ప్రతీదానిలో ఒక సంఖ్య ఉందనే విషయం గమనించాడు. ఆ సంఖ్యలు 1 నుండి 20 వరకు ఉన్నాయి. కానీ, అవి వరుసగా లేవు. వాటిని వరుసగా పెట్టి చూద్దామనుకొని, వరుసలో పెట్టాడు. అప్పుడు జోరున గాలి వీచి, ఆ తాళపత్రాలు బోర్లా పడ్డాయి. దిలీప్ బోర్లాపడిన ఆ తాళపత్రాల వెనుక ఒక పటం (map) ఉంది అని గమనించాడు. దానిని ఒక కాగితం మీద గీసి, అక్కడ పెట్టి, ఆ గదినుండి బైటకు వచ్చి తన పని చేసుకోవడానికి వెళ్ళాడు. ఆ పటం కిటికీ నుండి బైటకు ఎగిరిపోయింది. మరునాడు పొద్దున్న వివేక్, దిలీప్ క్రికెట్ ఆడుకోవడానికి వెళ్లారు. అప్పుడు దిలీప్ కొట్టిన బాల్ పట్టుకోవడానికి వివేక్ వెనక్కి పరిగెడుతూ హఠాత్తుగా కింద పడ్డాడు. అది చూసిన దిలీప్ పరిగెత్తుకుంటూ వివేక్ దగ్గరకు వచ్చి ఏమైంది అని అడుగుతూ, వాడి చేతిలో ఉన్న కాగితాన్ని గమనిస్తాడు. ఆ కాగితం తన మొహం మీద పడటం వల్లే బంతిని పట్టుకోలేకపోయానని, కిందపడ్డానని చెప్తాడు వివేక్. ఆ కాగితాన్ని పరిశీలించిన దిలీప్, అది తను గీసిన పటమే అనీ, అది ఒక నిధిని సూచించేదని అనుకుంటున్నానని, జరిగినదంతా చెప్పాడు.



తరువాత, వాళ్ళిద్దరూ కలిసి దిలీప్ వాళ్ళ ఇంటికి వెళ్లారు. ఆ తాళపత్ర గ్రంథాలను చూసి, వివేక్, "ఆ నిధిని మనం వెతుకుదామా?" అని అడిగాడు. వెతికేముందు, దాని గురించి పూర్తిగా తెలుసుకోవడం మంచిది అనుకున్నారు. వాళ్ళ పొరుగింటిలోనే ఉంటున్న సంస్కృత లెక్చరర్ ఉదయ్ అన్నని అడిగితే, వివరాలు ఏమైనా తెలుస్తాయేమో అని ఆలోచించి, ఆ తాళపత్ర గ్రంథాన్ని తీసుకొని అతని దగ్గరకు వెళ్లారు. ఉదయ్ ఆ గ్రంథాన్ని తీసుకొని, ఒక్కొక్క శ్లోకాన్ని చదువుతూ దాని అర్థాన్ని వివరించసాగాడు. చివరి శ్లోకం చదువుతున్న ఉదయ్ ఆ శ్లోకరచనలో ఒక ప్రత్యేకతీరును గమనించాడు. ఆ తీరును అనుసరించి ఆ శ్లోకాలన్నింటినీ వెనుకనుండి ముందుకి చదివాడు. దీనిని విలోమ కావ్యపద్ధతి అంటారు. ఈ

గ్రంథము విలోమ కావ్యపద్ధతిలో వ్రాయబడింది అని వాళ్ళతో చెప్పాడు. అంటే ఏమిటని, కుతూహలంగా అడిగారు దిలీప్, వివేక్. ఆ పద్ధతిని వివరిస్తూ ఉదాహరణగా 'దైవజ్ఞ సూర్య పండిత' అనే కవి రచించిన 'రామకృష్ణ విలోమకావ్యం' గురించి వాళ్ళకు చెప్పాడు. అదే విధంగా ఈ శ్లోకాలను వెనుకనుండి ముందుకి చదివితే ఒకకథ బయట పడింది. ఆ కథను ఉదయ్ పిల్లలకు చెప్పసాగాడు.

అనగనగా పద్మనాభపురం అనే రాజ్యం ఉండేది. ఆ రాజ్యం యొక్క మహారాజు చనిపోయారు. మంత్రుల సలహా మేరకు, ఆ రాజ్యపు రాజకుమారి అయిన ఏకాశిలాదేవికి స్వయంవరం ఏర్పాటు చేశారు. ఎన్నో దేశాల నుండి ఎందరో రాజులు ఆ స్వయంవరానికి విచ్చేశారు. ద్రవిడ దేశపు రాజైన విక్రమసింహుడి రాకకై ఎదురు చూస్తున్న ఏకాశిలాదేవికి, అతని దర్శనం కలిగింది. ఎంతో ఆనందంతో ఆమె విక్రమసింహుడిని వరించింది. ఈ విషయం తట్టుకోలేక సింహబలుడు మరియు అంగబలుడు అనే ఇద్దరు సోదరులు అతనిపై దాడి చేస్తారు. విక్రమసింహుడు తన పరాక్రమంతో వాళ్ళిద్దరినీ ఓడించి ఏకాశిలాదేవిని పరిణయమాడుతాడు.

అలా కొన్ని రోజులు హాయిగా గడిచాయి. ఒక సంవత్సరం వర్షాలు పడక, పంటలు పండక కరువు కాటకాలు రాజ్యమంతా వ్యాపించాయి. ప్రజలను ఈతిబాధల నుండి రక్షించడానికి, మహారాజు విక్రమసింహుడు శివోపాసన చేయడానికి సింధు సాగరతీరానికి వెళ్ళాడు.

తెల్లవారుఝామున సంధ్యావందనం చేస్తూ, అర్ఘ్యం వదలటానికి చేతిలోకి నీరు తీసుకోగా, విక్రమసింహుని చేతిలోకి ఒక మణి వచ్చింది. ఎర్రటిరంగులో ధగధగా మెరుస్తున్న ఆ మణిని చూసి, సంభ్రమాశ్చర్యాలతో దానిని తీసుకొని తన రాజధానికి చేరాడు. ఆ మణిని తీసుకొని తమ ఆస్థానపురోహితుడు భవన్నారాయణశాస్త్రి గారిని కలిసి, ఆ మణిని గురించి వివరించమని కోరాడు. బదులుగా శాస్త్రిగారు ఆ మణి గురించి ఇలా వివరించారు.

"నీకు దొరికిన మణి సామాన్యమైనది కాదు. ఇది శ్రీకృష్ణుని శమంతకమణి. అది చివరిగా అక్రూరుని వద్ద ఉన్నది. ద్వారక సముద్రగర్భమున మునిగినపుడు, ఆ మణి కూడా సముద్రమున చేరినది. నీ అదృష్టవశాత్తు, ఆ మణి ఇప్పుడు నీకు దొరికినది. ఈ మణి ఏ రాజ్యములో ఉంటుందో.. ఆ రాజ్యము సస్యశ్యామలముగా, సుభిక్షముగా అలరారుతుందని ప్రతీతి" అని చెప్పాడు.

పురోహితుడు విక్రమసింహుడికి ఈ విషయం చెప్తున్నప్పుడు విక్రమసింహుడి మహామంత్రి అయిన ఉగ్రసేనుడు ఈ మాటలను విన్నాడు. తన కూతురుని వివాహం చేసుకోలేదని విక్రమసింహుడి మీద కోపంతో ఉన్న ఆయన, సింహబలుడిని కలిసి ఈ మణిని గూర్చి అతనికి తెలిపాడు.

ఈలోగా విక్రమసింహుడు ఆ మణిని ఉపయోగించి, తన రాజ్యంలో ఉన్న ప్రజలందరి కష్టాలు తీర్చాడు. ఉగ్రసేనుడు సింహబలుడికి ఆ మణి గురించి చెప్పడం విన్న విక్రమసింహుని వేగు, విక్రమసింహుడికి ఆ విషయం చెప్పాడు. విక్రమసింహుడు ఏకాశిలాదేవికి జరిగినదంతా చెప్పాడు. ఇద్దరూ ఆలోచించి, ఆ మణిని, ఆ మణి వల్ల వచ్చిన బంగారాన్ని అడవి మధ్యలో ఉన్న ఒక గుహలో దాచిపెడదామని అనుకున్నారు. దాచిన స్థలాన్ని శత్రుదుర్భేద్యం చేయతలచి, భవన్నారాయణశాస్త్రి గారి వద్దకు వెళ్ళి ఈ వృత్తాంతమంతా వివరించారు. అది విన్న భవన్నారాయణశాస్త్రి,, మణిని, బంగారాన్ని దాచాక ఆ గుహని ద్వారాలతో ముయ్యమని చెప్పారు. అ ద్వారాలకు నాగబంధనం వేస్తానని అన్నారు.

మహారాణి ఏకాశిలాదేవి నమ్మినబంటులైన కోటయ్య, భద్రయ్యలను తీసుకొని మహారాజు విక్రమసింహుడితో పాటు భవన్నారాయణశాస్త్రిగారు, అడవి మధ్యలో ఉన్న ఆ గుహ వద్దకు చేరుకున్నారు. ఆ గుహలో కొంత దూరం వెళ్ళాక, ఒక దగ్గర మట్టిని తవ్వి భూమి లోపలకు ఒక మార్గం ఏర్పాటు చేశారు కోటయ్య, భద్రయ్య. ఆ ప్రదేశంలో మూడు గదులను తయారు చేసి ఒకటవ, మూడవ గదులలో బంగారం, వజ్రాలు, ఖనిజాలు, రత్నాలు పెట్టారు. మధ్యలో ఉన్న గదిలో శమంతకమణిని పెట్టారు. ఈ గుహ నుండి భద్రయ్య వాళ్ళ ఇంటికి ఒక సొరంగ మార్గం ఏర్పాటు చేశారు.

పురోహితుడు నాగబంధం కోసం చేయవలసిన యజ్ఞానికి కావలసిన వాటిని సిద్ధం చేసుకున్నాడు. ఈలోగా ఒక భటుడు ఎంతో వేగంతో ఆయాసపడుతూ ఆ గుహలోకి వచ్చి, సింహబలుడు రాజ్యంపై దాడి చేశాడనే విషయాన్ని విక్రమసింహుడికి చెప్పాడు. విక్రమసింహుడు కోటయ్య, భద్రయ్యలను యజ్ఞానికి కాపలాగా ఉంచి, ఏకశిలాదేవితో పాటు యుద్ధం చేయడానికి వెళ్ళాడు.

పురోహితుడు యజ్ఞం సమాప్తం చేసి ఆ ద్వారాలకు నాగబంధనం వేశాడు. ఈ నిధి ఇక్కడే గుప్తమైపోతే, రాబోయేతరాలకు ఉపయోగపడదు అనే ఆలోచనతో ఆ నిధిని చేరే మార్గాన్ని సూచిస్తూ 20 తాళపత్రాల మీద ఒక పటం గీశాడు. పత్రాలు వరుస ఉంటే, ఆ పటం తేలికగా తెలిసిపోతుందని వాటి వరుసక్రమాన్ని కలగాపులగం చేసాడు. ఒక్కో తాళపత్రం మీద, ఒక్కో శ్లోకం రాసి, ఆ శ్లోకాల్లో అది పటంలో ఎన్నో భాగమో తెలిపే సంఖ్యను వ్రాశాడు. వాటిని తాడుతో కట్టి ఒక తాళపత్ర గ్రంథాన్ని తయారు చేశాడు. ఆ గ్రంథాన్ని కళ్ళ కద్దుకొని, దైవాన్ని రాబోయేకాలంలో ఆ గ్రంథాన్ని సరైనవారి చేతిలోకి చేర్చి, నిధిని ప్రజలకు ఉపయోగపడేలా చెయ్యమని మనస్ఫూర్తిగా ప్రార్థించాడు.

ఈ పని ముగిసేసరికి యుద్ధంలో మహారాజు, మహారాణి వీరమరణం పొందారన్న వార్త భావన్నారాయణశాస్త్రికి తెలిసింది. అంతలోనే సింహబలుడు తన సైన్యంతో కూడి ఈ గుహ వద్దకు వచ్చాడు. ఆ సేనలో ఒక సైనికుడు గుహలోకి విసిరిన బల్లెం పురోహితుడికి తగిలి ఆయన చనిపోబోతూ కోటయ్య, భద్రయ్యల చేతిలో ఆ తాళపత్ర గ్రంథాన్ని ఉంచి, దానిని ఎక్కడైనా భద్రంగా దాచిపెట్టమని చెప్పారు. భద్రయ్యని ఆ పని మీద పంపి, తాను రాజపురోహితునితో ఉండిపోయాడు కోటయ్య .

భద్రయ్య ఆ సొరంగ మార్గం ద్వారా చెరువు దగ్గర ఉన్న తన ఇంటికి వెళ్ళి ఆ తాళపత్ర గ్రంథాన్ని దాచి వెనుకకు బయలుదేరాడు.

సింహబలుడితో, అతని సైన్యంతో జరిగిన యుద్ధంలో కోటయ్య అంగబలుడిని చంపగా, అతన్ని తిరిగి వచ్చిన భద్రయ్యను కూడా సింహబలుడు చంపేశాడు. సింహబలుడు, అతని సేన ఆ మూడు ద్వారాలను తెరవడానికి ఎంత ప్రయత్నించినా, వారు ఆ నాగబంధనాన్ని విప్పలేకపోతారు. దాంతో వారు తిరిగి రాజ్యానికి వెళ్ళి పోతారు. ఆ తాళపత్రగ్రంథం భద్రయ్య ఇంట్లో భద్రంగా ఉంది. ఇలా కథ చెప్పడం ముగించాడు ఉదయ్.

అప్పుడు దిలీప్‌కి తమ ఇంటి సమీపంలో ఉన్న చెరువు దగ్గర ఉన్న ఇల్లు గుర్తుకొచ్చింది. ముగ్గురూ కలిసి ఆ ఇంటి దగ్గరకు వెళ్ళారు. చాలా సమయం పాటు సొరంగ మార్గం కోసం వెతికారు. వివేక్ అక్కడ ఉన్న ఒక తులసికోట మీద చేయి వేయగానే, ఆశ్చర్యంగా ఆ తులసికోట వెంటనే వెనక్కు వెళ్ళింది. అక్కడే, ఆ గుహకు వెళ్ళే సొరంగ మార్గం ఉంది. ఆ మార్గం ద్వారా వెళ్ళి, ముగ్గురూ గుహకు చేరుకున్నారు. అక్కడ నాగబంధనం వేసిన మూడు ద్వారాలను చూశారు.

నాగబంధనాన్ని విప్పేందుకు గరుడమంత్రమే దారి అని ఉదయ్ పిల్లలకు చెప్పాడు. కానీ, ఆ మంత్రం ఉదయ్‌కి తెలియదు. ఒకసారి తాళపత్ర గ్రంథాన్ని పరిశీలిస్తే, దానిలో ప్రతీ శ్లోకంలోని పాదం యొక్క మొదటి అక్షరాలన్నీ కలిపితే, అదే గరుడమంత్రమని ఉదయ్‌కి అర్థమైంది. పిల్లలతో పాటు ఆ గరుడమంత్రాన్ని ప్రతీద్వారం దగ్గర ఒక్కో సారి చదివి, ఆ నాగబంధనాన్ని విప్పాడు. ఆ ద్వారాలలో బంగారం, రత్నాలు, వజ్రాలు మొదలైనవన్నీ ఉన్నాయి. మధ్యలో ఉన్న ద్వారంలో శమంతకమణి ఉంది. వెంటనే ఉదయ్ ఈ విషయం తనకి తెలిసిన ఒక ప్రభుత్వాధికారికి తెలిపాడు. ఇదంతా అయిపోయేటప్పటికి మరునాడు తెల్లవారింది.

ఆ రోజు సూర్య గ్రహణం. ఆ సమయంలో బయటకు వెళ్లకూడదని ఉదయ్ పిల్లలకు చెప్పాడు. అందుకని, గ్రహణం అయిపోయిన తరువాత బయటకు వెళదామని చెప్పాడు. గ్రహణం అయిపోయే సమయానికి ఉదయ్ మరియు పిల్లలు గుహనుండి బయటకు వచ్చారు. వివేక్ చేతిలో శమంతకమణి ఉంది. గ్రహణం విడుస్తున్నప్పటి సూర్యుడి మొదటి కిరణం ఆ మణిమీద పడటంతో, ఆ మణి గాలిలోకి ఎగిరి నేరుగా సూర్యుడి దగ్గరకు వెళ్ళిపోయింది.

ప్రభుత్వానికి ఆ నిధిని అప్పజెప్పినందుకు, పిల్లలకు వారు చదవదలచినంత వరకు ఏ చదువైనా ఖర్చును తామే భరిస్తామని ప్రభుత్వం చెప్పింది. పిల్లలిద్దరి పేరా వారి భవిష్యత్తుకు చెరో పాతిక లక్షలు బ్యాంక్‌లో జమ చేయటమే కాక, ఆ సంవత్సరం 'సాహస బాలల పురస్కారం' వాళ్ళిద్దరికీ ప్రకటించింది. దిలీప్, వివేక్‌ల సంబరం అంబరాన్ని అంటుకుంది. వాళ్ళ తల్లిదండ్రులు వాళ్ళని చూసి ఎంతో గర్వపడ్డారు. పాఠశాలలో వాళ్ళు హీరోలయ్యారు. ఇక వారికి సహాయపడిన ఉదయ్‌కి, ప్రభుత్వోద్యోగంతో పాటు, ఇల్లు కట్టుకునేందుకు స్థలాన్ని కూడా మంజూరు చేసింది ప్రభుత్వం. ఆ నిధితో ఎన్నో ప్రజాసంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది.

# దాతకు సన్మానం

నారంశెట్టి ఉమామహేశ్వరరావు
✆ 9490799203

**విశిష్ట అతిథి కథ**

***"దాతలంతా ఉన్నది అనుభవిస్తూ మిగిలిందే దానమిస్తారు. వ్యాపారి సుబ్బయ్య పిసినారి కాబట్టి సంపాదించడమే తప్ప, ఖర్చు పెట్టడం లేదు. అతనికి సంతానం లేదు. కాబట్టి ఆ ఆస్తి మొత్తం ఎప్పటికైనా రాజుగారికి చెందుతుంది. దాచిందంతా లోకానికిచ్చేవాడు మహాదాత కాక మరేమవుతారు!"***

విదర్భరాజ్యపు మహారాజు విక్రమకేతు చేతికి ఎముకలేదన్నట్టు దానధర్మాలు చేసేవాడు. ఆయన దానధర్మాల గురించి ప్రజలు గొప్పగా చెప్పుకునేవారు.

మహారాజు విక్రమకేతు సభలో ఉన్న సమయంలో ఒక బ్రాహ్మణుడు వచ్చి "నాకు కొడుకు పుట్టాడు. చంటిబిడ్డకి తల్లి పాలు చాలడం లేదు. దయతో ఒక గోవును దానం చేయండి!" అని అడిగాడు.

అక్కడున్న ఒక భటుడిని పంపించి, గోశాలనుండి ఉత్తమజాతికి చెందిన గోవును తెప్పించాడు మహారాజు. గోవుకు బంగారు గిట్టలు, కొమ్ములు తగిలించి బ్రాహ్మణుడికి దానం చేసాడు. దానం పొందిన బ్రాహ్మణుడు సంతోషంతో, 'మీవంటి గొప్ప దానశీలుడిని ఇంతవరకూ చూడలేదు. మరెక్కడా ఉండడేమో!" అని పొగడ్తలతో ముంచెత్తాడు.

రాజు సంతోషంతో సభికుల వైపు చూసి, "నా దానాల గురించి అంతా మాట్లాడగా విన్నాను. నేను గొప్పదానాలను చేసినట్టు రాజ్యమంతా చెబుతారు. లోకంలో ఉత్తమదానమేదో, ఉత్తమదాత ఎవరో తెలిసినవారు చెప్పండి?" అన్నాడు.

రామయ్య అనే సభికుడు లేచి, "మీ దానాలు అవసరంలో ఉన్నవాళ్ళను ఆదుకుంటాయి. మీ దానాలు గొప్పవే!" అన్నాడు.

సుందరయ్య అనే రైతు, "కర్ణుడి దానగుణాన్ని లోకమంతా చెప్పుకుంటుంది. అడిగినవారికి లేదనకుండా దానం చేసాడు. తనకి ప్రాణహాని ఉందని తెలిసీ కవచకుండలాలని దానమిచ్చాడు!" అన్నాడు.

మాధవయ్య అనే వ్యాపారి "ధర్మరాజు చేసిన దానం గురించి ప్రజలు చెప్పుకోగా ఒక ముంగిస మాత్రం కాదని చెప్పింది. 'సక్తుప్రస్తుడనే పేద బ్రాహ్మణుడు చేసిన అన్నదాన మహిమతో పోలిస్తే, ధర్మరాజు చేసిన దానం తక్కువేన'ని అంది.

సక్తుప్రస్తుడు చేసిన అన్నదానం రోజున, అతిథులు చేతులు కడుక్కున్న నీరు తన దేహానికి తగిలిందని, తన శరీరంలో సగం బంగారుమయం అయిందని, మిగతా సగం బంగారం చేసుకోవడం కోసం, ధర్మరాజు దానం చేసిన చోట ప్రయత్నిస్తే ఎలాంటి ఫలితం కలగలేదని చెప్పింది!" అన్నాడు.

వేదయ్య అనే వ్యక్తి "తాను పస్తులుండి, అతిథులకు భోజనం పెట్టిన రంతిదేవుడనే మహాదాత ఒకప్పుడు ఉండేవాడు!" అన్నాడు.

విశ్వనాథం అనే బ్రాహ్మణుడు, "శరీరభాగాలను తృణప్రాయంగా దానం చేసిన దాతలున్నారు. వెన్నెముకను దానం చేసిన దధీచి, డేగ కోసం తొడనుండి మాంసం కోసిన శిబిచక్రవర్తి అలాంటివారే! వామనుడికి బలి చక్రవర్తి చేసిన దానంతో పోలిస్తే మీ దానాలు అంత గొప్పవి కావు!" అన్నాడు.

సభికుల జవాబులకు రాజు చాలా సంతోషించి, "మంచి విషయాలూ, గొప్ప దాతల గురించీ తెలిపారు. వారిలాగా కీర్తి పొందడానికి మరిన్ని గొప్ప దానాలు చెయ్యాలని తెలిసింది. మన రాజ్యంలో నన్ను మించిన దాతలెవరైనా ఉన్నారా? అలాంటివారిని పరిచయం చేస్తే సభకు పిలిచి సత్కరిద్దాము" అన్నాడు.



సభికుల్లో కొందరు తమకు తెలిసిన కొన్ని పేర్లు చెప్పారు. అవేవీ సరైనవి కావని తేల్చారు మరికొందరు.

అంతలో విదూషకుడు లేచి నిలబడి "మన రాజ్యంలో ఉన్న వ్యాపారి సుబ్బయ్య గొప్పదాత" అన్నాడు.

సభికులంతా ఆ పేరు విని ఆశ్చర్యపోయారు. "సుబ్బయ్య ధనవంతుడే, కానీ దాత కాదు!" అన్నాడు కోశాధికారి.

"దాతగా సన్మానానికి అతడెలా అర్హత పొందాడు?" అని అడిగాడు మంత్రి మాధవయ్య.

"అతడు పిసినారి. పిల్లికి బిచ్చం పెట్టడు. సుబ్బయ్య సన్మానానికి అనర్హుడు!" అన్నాడు ఆస్థానకవి.

వారందరి ప్రశ్నలకు జవాబు ఇవ్వమన్నట్టు విదూషకుడి వైపు చూసాడు రాజు విక్రమకేతు.

"సుబ్బయ్య పిసినారి కాబట్టే గొప్పదాత!" అన్నాడు విదూషకుడు నవ్వుతూ.

"అదెలా?" అని ఆశ్చర్యపోయాడు మంత్రి మాధవయ్య.

"దాతలంతా ఉన్నది అనుభవిస్తూ మిగిలిందే దానమిస్తారు. వ్యాపారి సుబ్బయ్య పిసినారి కాబట్టి సంపాదించడమే తప్ప, ఖర్చు పెట్టడం లేదు. అతనికి సంతానం లేదు. కాబట్టి ఆ ఆస్తి మొత్తం ఎప్పటికైనా రాజుగారికి చెందుతుంది. దాచిందంతా లోకానికిచ్చేవాడు మహాదాత కాక మరేమవుతారు?" అని విదూషకుడు అనగానే సభంతా నవ్వులతో గొల్లుమంది.

విదూషకుడి వాదనతో ఏకీభవించి సుబ్బయ్యను సన్మానించడానికి ఆమోదం తెలిపాడు విక్రమకేతు.

ఒకరోజు సుబ్బయ్యను సభకు రప్పించారు. తనలాంటి పిసినారికి సన్మానమేమిటని ఆశ్చర్యపోయాడు వ్యాపారి సుబ్బయ్య. సభికుల మాటలు విన్న తరువాత 'తానేమీ సుఖాలను, భోగాలను అనుభవించడం లేదని, పోయేటప్పుడు ఏదీ మోసుకుపోలేదని' గ్రహించాడు. మరుక్షణం కనువిప్పు కలిగింది సుబ్బయ్యకి!

బ్రతకడానికి సరిపోయే ధనాన్ని ఉంచుకుని, మిగిలినదంతా పేదసాదలకి దానధర్మాలు చేసాడు సుబ్బయ్య. రాజ్యంలోని పిసినారులంతా సుబ్బయ్యని చూసి మారిపోయారు. ఎవరికైనా అవసరం ఉన్నట్టు తెలిస్తే సహాయం చేసేవారు. అలా సుబ్బయ్యకి చేసిన సన్మానం పిసినారుల్లో దానగుణాన్ని పెంచింది. అలా విదూషకుడి మాట నిజమైంది!

# బంగారు పిచ్చుక

## కీ. శే. బి. వి. నరసింహారావు

**కథామార్గదర్శి కథ**

> ***నా గూడూ గుడ్లూ దొరికినాయి. తీసుకువెళ్లిన ఒక బుజ్జి నాన్న తిరిగి తీసుకువచ్చి ఇచ్చాడు. అతడు దొంగగాడు, దొడ్డనిజాయితీ కలవాడు! మీరెవరూ అతని మీద ఆగ్రహించకండి. మీరెవరూ శ్రమపడి వెతకడానికి బయలుదేరనక్కరలేదమ్మా."***

ఏనాటిదో ఈ కథ!

అనగనగా ఒక బంగారు పిచ్చుక ఉండేది. అది పట్టునారతో ఒక చక్కని గూడు అల్లుకొని అందులో మెత్తని ఈకలు పరుచుకొని, ముద్దయిన రెండు ముత్యాల గుడ్లు పెట్టుకుంది. ఒకనాడు పిచ్చుక మేతకు వెళ్ళడం చూచి, పక్క నున్న పల్లెటూరి కుర్రవాడు ఒకడు మెల్లగా వచ్చి, ఆ గూటిని గుడ్లతో సహా దొంగిలించుకు పోయాడు. పిచ్చుక తిరిగి వచ్చి చూచుకొంది. గూడులేదు. గుడ్లు లేవు. గోడుగోడున ఏడ్చింది. కష్టపడి అల్లుకొన్న గూడూ, కన్నగుడ్లూ పోతే ఏడవదూ మరి? కనబడిన అందరినీ అడగడం మొదలు పెట్టింది పిచ్చుక... "నా గూడు దొంగిలించారా? నా గూడు దొంగిలించారా?" అని. అలా అలా తిరిగి కుక్కపిల్ల నడిగింది. "నా గూడు దొంగిలించావా?" అని!

'కుయ్యో మొర్రో.. నే నెరుగను' అంది కుక్కపిల్ల. ఆడుకొనే ఆవుదూడ నడిగింది పిచ్చుక.. "నా గూడు దొంగిలించావా?" అని. "అయ్యో.. అంబా! నేనలాంటి పని ఎప్పుడూ చెయ్యను" అంది ఆవుదూడ. తరువాత పిచ్చుక.. తుమ్మెద నడిగింది, తూనీగ నడిగింది. చెరువునడిగింది, చెట్టునడిగింది, పువ్వు నడిగింది, పిల్లకాల్వ నడిగింది. "నా గూడు దొంగిలించారా?" అని.

"రామ రామ అలాంటి దొంగపని మేమెన్నడూ చెయ్యం" అన్నారు వాళ్ళంతా.

ఇక చేసేదేమీ లేక, పిచ్చుక కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. పిచ్చుక ఏడ్పు విని కుక్కపిల్ల, ఆవుదూడ, తుమ్మెద, తూనీగ, చెరువు, చెట్టు, పువ్వు, పిల్లకాలవ ఎంతో జాలిపడి, "పిచ్చుకమ్మా! ఏడవకు. నీ గూడు దొంగిలించిన దొంగను పసికట్టి తెస్తాం" అన్నారు.



“దొంగను ఎలా పసికట్టగలరు?” అని అడిగింది పిచ్చుక.

“దొంగైతే నా ముందుకే రాడు” అంది కుక్కపిల్ల.

“నా వెనక్కే రాడు” అంది ఆవుదూడ.

“నా రొద విని చెదరగొట్టడు” అంది తుమ్మెద.

"నన్ను పట్టుకొని బాధపెట్టడు" అంది తూనీగ.

"నా గట్టునే నడవడు" అంది చెరువు.

"నా నీడనే నిలవడు" అంది చెట్టు.

"నన్ను తుంచి వాసన చూడడు" అంది పువ్వు.

"నన్ను దాటిపోడు" అంది పిల్లకాలువ.

"ఎందుచేత?" అని అడిగింది మళ్ళీ పిచ్చుక.

"దొంగనన్న బెంగచేత! దొరికితే శిక్షిస్తామన్న భయంచేత..!" అన్నారు వాళ్ళంతా.

పిచ్చుకమ్మ వాళ్ళ దయకెంతో కృతజ్ఞత తెలిపింది.

"దొంగను పట్టాలి.. పట్టి తీరాలి!" అని వాళ్ళు దిక్కులు పిక్కటిల్లేలాగ మూడుసార్లు గట్టిగా కేకలు వేశారు. గూడు దొంగిలించుకు పోయిన కుర్రవాడు వాళ్లింటిలో ఒక మూల ఉన్నాడు. ఈ కేకలు విన్నాడు. కంగారు పడ్డాడు. తన గుట్టు దాగదని భయపడ్డాడు. చేసిన పని చాలా చెడ్డదని కూడా గ్రహించాడు. 'ఏమి చెయ్యడమా?' అని ఒక నిమిషం ఆలోచించాడు. చేసిన తప్పు దిద్దుకోవడానికి, తీసిన గూడును తీసిన చోటే గప్ చిప్ మనకుండా పెట్టి రావడానికి నిశ్చయించుకున్నాడు. కుర్రవాడు పిచ్చుకగూడు చేత్తో పుచ్చుకొని, దొడ్డి దారిని పిల్లిలాగ మెల్లగా వెళ్ళి తీసిన చోటునే పెట్టి, తిరిగి

వస్తున్నాడు. దారిలో పిచ్చుక ఎదురయింది. దాన్ని చూడగానే అతనికి గుండె గతుక్కుమంది. మెల్లగా ధైర్యం తెచ్చుకొని, గొంతుక సర్దుకొని "పిచ్చుకమ్మా! నీ గూడూ గుడ్లు దొంగిలించింది నేనే! నిజం చెపుతున్నా. వాటిని తీసినచోటే పెట్టివస్తున్నా. కోప్పడకు! ఎవరికీ నా మీద కోపం కలగకుండా చూడు!" అని బ్రతిమాలడం ప్రారంభించాడు.

ఆ కుర్రవాని మాటలు విని పిచ్చుక ఆశ్చర్యపడింది. ఆనందపడింది. "అయ్యో నా బుజ్జితండ్రీ! నీ తల్లి కడుపు చల్లకుండా! నిజం చెప్పిన నీ మీద ఎవరికైనా కోపం కలుగుతుందా.. గౌరవం కలుగుతుందిగాని!" అంటూ తుర్రున ఎగిరి వెళ్ళి, తన గూటిని గుడ్లను సురక్షితంగా ఉండడం చూచింది. పట్టలేని సంతోషం పొందింది. అక్కడ నుంచి పిచ్చుక పరుగున పోయి, "కుక్క పిల్లా.. ఆవుదూడా.. తుమ్మెదా.. తూనీగా.. చెరువూ.. చెట్టూ, పువ్వూ.. పిల్లకాలవా! విన్నారా ఈ మాట? నా గూడూ గుడ్లూ దొరికినాయి. తీసుకువెళ్లిన ఒక బుజ్జి నాన్న తిరిగి తీసుకువచ్చి ఇచ్చాడు. అతడు దొంగగాడు, దొడ్డనిజాయితీ కలవాడు! మీరెవరూ అతని మీద ఆగ్రహించకండి. మీరెవరూ శ్రమపడి వెతకడానికి బయలుదేరనక్కరలేదమ్మా" అని మైమరచి చెప్పడం ప్రారంభించింది. అంతా ఆ మాటలు విన్నారు. "అంత బుద్ధిమంతుడైన బుజ్జివాణ్ణి ఒకసారి ఇక్కడకు తీసుకురా! మేమూ చూస్తాం. ఆనందిస్తాం" అన్నారు.

పిచ్చుకమ్మ బయలుదేరింది. ఒక పిలుపు పాట పాడుకుంటూ..!

"రావయ్య నా బుజ్జి రావయ్య తండ్రీ!

నిజము చెప్పిన నీకు నిండు దీవెనలు!

తప్పు చేసినవారు ఒప్పుకుంటార?

నిజము ఘనతెరిగినా నీకె తగుగాక!

మా వారలందరూ మంచి గౌరవము

నీ కీయ దలచారు నిక్కముగ, రమ్ము!"

పిచ్చుకమ్మ ఆ కుర్రవాణ్ణి తన మిత్రులందరికీ చూపించడానికి ఆహ్వానించి తోడితెచ్చింది. అందరూ అతని చుట్టూ చేరారు. కుక్కపిల్ల, ఆవుదూడ చెంగుచెంగున వాని చుట్టూ ఆనందంగా గంతులువేశాయి. తుమ్మెద జుమ్మని గానం చేసింది. తూనీగ పైన ఒయ్యారంగా నాట్యం చేసింది. చెరువు పండు ముత్తయిదువులా నిండుగా మురిసి చూచింది. చెట్టు నిలబడి నీడనిచ్చి ఆదరంగా చూచింది. పువ్వు కలకల నవ్వి కమ్మని సువాసన విరజిమ్మింది. పిల్లకాలువ ఉల్లాసంగా ఉరుకుతూ పక్కనే ప్రవహించింది. పిచ్చుకమ్మ ఆపుకోలేని ఆవేగంతో ఆనందాశ్రులు రాల్చింది.

అందరూ కలిసి ఆ కుర్రవాణ్ణి...

"అందుకో ఓ బుజ్జి అందాల బాలా!

మా హృదయ కుసుమాల మంచి ఒక మాలా!

నిజము చెప్పిన నీకు నిండు దీవెనలు కలకాల

మీ గాథ ఇలను వర్ధిల్లు."

అని కీర్తించాయి.

## కథల ఎంపిక.. ఏ విధంబుననగా .. !

కథామంజరి ప్రారంభించి ఐదు సంవత్సరాల నాలుగు నెలలు గడిచింది. ప్రతినెలా ఎనిమిది కథలను (అందులో రెండు బాలకథలు) ప్రచురిస్తూ, క్రమం తప్పకుండా ఒకటో తారీఖున పాఠకులకు అందేటట్టు, నిత్యం కృషి చేస్తున్నాం! అలాగే.. ఏడాదికి రెండుసార్లు కథల పోటీలు నిర్వహిస్తూ.. మంచి కథలను పాఠకులకు అందచేసే ప్రయత్నం కూడా చేస్తున్నాం!

ఎప్పటికప్పుడు వచ్చే కథలను పరిశీలించి ప్రచురణకు యోగ్యమైన కథలను ఎంపిక చేసి, నెలకోసారి .. అంటే సుమారుగా ప్రతినెలా రెండోవారంలో, ఆయా రచయితలకు తెలియచేయడం జరుగుతోంది. అలా ఎంపికైన కథలను.. అవి మాకు చేరిన తేదిని ఆధారంగా వరుస క్రమంలో ప్రచురణ చేయడం.. ప్రచురణకు ముందుగానే.. అంటే సుమారు మూడు వారాలు ముందుగానే ఆయా రచయితలకు తెలియచేయడం.. సంచిక విడుదలైన పదిరోజుల లోపు ఆ కథల పారితోషికం ఆయా రచయితలు తెలియచేసిన బ్యాంకు అకౌంట్ లో జమ చేయడం జరుగుతోంది.

అలాగే.. పోటీకి వచ్చే కథలను కథామంజరి సంపాదక బృందం, విడివిడిగా క్షుణ్ణంగా చదివి, వడబోసి, వారు సమష్టిగా ఎంపిక చేసిన ముప్పై లేదా నలభై కథలను ఓ ప్రధాన న్యాయనిర్ణేతకి పంపడం, వారు అంతిమంగా బహుమతుల కథలను ఎంపిక చేసి తెలియచేయడం.. ఓ క్రమపద్ధతిలో జరుగుతుంది. ఈ మొత్తం ప్రక్రియలో.. సంపాదక వర్గానికి గాని, ప్రధాన న్యాయనిర్ణేతకి గాని కథారచయితల పేర్లు తెలియచేయకుండా గోప్యత పాటించడం జరుగుతుంది. కథారచనలో నిష్ణాతులైన వారినే న్యాయనిర్ణేతగా నిర్ణయిస్తాం. న్యాయనిర్ణయంలో వారికి పూర్తి స్వేచ్ఛని ఇచ్చి, వారి నిర్ణయానుసారంగానే బహుమతులు అందచేస్తున్నాం!

కథల ఎంపిక విషయంలో.. కొందరు వ్యక్తపరుస్తున్న అపోహలను దృష్టిలో పెట్టుకుని ఈ వివరణ ఇస్తున్నాం! సహృదయులైన రచయితలు, పాఠకులు.. మా వివరణను అర్థం చేసుకోగలరని ఆశిస్తున్నాం!

**కథామంజరి బృందం**